రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త



# కీసరగుట్టకు శృంగేరి పీఠాధిపతి రాక



కీసరగుట్ట స్వామివారి సన్నిదిలో జగద్గురు శ్రీ విధుశేఖర భారతీ మహాస్వామి

**కీసర, నవంబరు 2, ప్రభాతవార్త :** తెలంగాణాలోనే సుప్రసిద్ధ శైవ క్షేత్రమైన కీసరగుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వరస్వామిని శృంగేరి పీఠాధిపతి జగద్గురు శ్రీ విధు శేఖర భారతీ మహస్వామి ఆదివారం దర్శించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ వేద పండితులు ఆయనకి పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయ చైర్మన్ తటాకం నారాయణశర్మ ఘనంగా సన్మానించి,స్వామివారి తీర్ధ ప్రసాదాలు అందజేశారు. కార్తీక మాసం ఆదివారం సెలవుదినం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకోవడానికి బారులు తీరారు.జగద్గురు శ్రీ విధు శేఖర భారతీ మహ స్వామి భక్తులకు ఉద్దేశించి ప్రవచనాలు చెప్పారు.గతంలో కీసరగుట్ట వేద పాఠశాలలోనే విద్యను అభ్యసించానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ కట్టా సుధాకర్‌రెడ్డి, ట్రస్టు బోర్డు మెంబర్లు నల్ల మధుసూదన్‌రెడ్డి, రెడ్డబోయిన ప్రవీణ్‌కుమార్, క్రిష్ణారెడ్డి, రాజు, ముత్యాలు, దుర్గా ప్రసాద్‌గౌడ్, అమరేందర్, కుమార్. రాజిరెడ్డి, అనిత, శంకరయ్య, సాయిలు, ప్రభాకర్‌గౌడ్ , సురేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## 30 ఏళ్లుగా ఉన్న చెట్టుపై గొడ్డలి వేటు



### ఘట్‌కేసర్‌లో స్థానికుల ఆగ్రహం
### ఫారెస్ట్ అధికారికి ఫిర్యాదు




తాండూరు ప్రాంత గనులు

అమ్మకానికి సిద్ధంగా ఉన్న పాలిష్ రాయి

**తాండూరు రూరల్, బషీరాబాద్, బంట్వారం, కొడంగల్ మండలాల్లో విస్తరించిన నాపరాయి గనులు**

**61 గనులకు మాత్రమే లీజులు**

**గడువు దాటి మూడేళ్లు గడుస్తున్నా కొనసాగుతున్న తవ్వకాలు**

**తవ్వకాల నిక్షేపాలూ అక్రమంగా రవాణా**

**రాబడికి టార్గెట్‌లు పెట్టినా ఫలితం సున్నా**

**మైనింగ్ ఉదాసీనతతో రెచ్చిపోతున్న అక్రమార్కులు**

**సర్కారుకు రూ.10 కోట్లకు మించి రాని ఆదాయం**

**కర్నాటక నుంచి జోరుగా జీరో దందా..**

**రోజుకు 10 నుంచి 20 రాయల్టీ రశీదులు**

**70 శాతం ఇల్లీగల్‌గా నాపరాయి రవాణా**

**అనధికార చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి లారీల నుంచి అక్రమ వసూళ్లు**

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** తాండూరు ప్రాంతం నుంచి జోరుగా ఖనిజాల రవాణా సాగుతోంది. రాయల్టీలు ఎగవేస్తూ నాప రాయి తరలిస్తున్నారు. లీజుల గడువు పూర్తయినా గనుల్లో అక్రమంగా తవ్వకాలు జరుపుతున్నారు. గనులు, భూగర్భవనరుల అధికారులు కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉన్నది. మైనింగ్ అక్రమ దందా వల్ల యేటా రూ.50 కోట్ల రాబడికి గండి పడుతున్నట్లు అంచనా. అక్షరాలా అరకోటి రూపాయలు అక్రమార్కుల జేబుల్లోకి వెళుతున్నట్లు తెలుస్తున్నది. సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాలో అక్రమ దందాను అరికట్టాల్సిన బాధ్యత మైనింగ్ అధికారులపై ఉంది. ఇప్పటి వరకు విజిలెన్స్ దాడులు నిర్వహించిన దాఖలాలు చాలా తక్కువగా ఉన్నాయి.

### లీజులు తక్కువ.. తవ్వకాలు ఎక్కువ

తాండూరు రూరల్ మండలం ఓగీపూర్, కరణ్‌కోట, మల్కాపూర్, సంగెంకలాన్, కోటబాసుపల్లి, సిరిగిరిపేట, బషీరాబాద్ మండలం ఎక్మాయి, కోర్వీచేడ్, క్యాద్గిరా, జీవన్గీ ప్రాంతాల్లో ఉన్న నాపరాయి గనులు విస్తరించి ఉన్నాయి. ఇవి కాకుండా బంట్వారం మండలం, కొడంగల్ మండలంలోని రావల్‌పల్లి ప్రాంతాల్లో కూడా గనుల తవ్వకాలు జరుపుతున్నారు. ప్రస్తుతం నాపరాయి గనుల్లో 61 లీజులు మాత్రమే ఉన్నాయని మైనింగ్ అధికారులు చెబుతున్నారు. ఇంకా పలు లీజుల గడువు పూర్తయి రెండు, మూడేళ్లు గడుస్తున్నా తవ్వకాలు మాత్రం యథావిధిగా కొనసాగిస్తున్నారు. ఈ తవ్వకాల నిక్షేపాలకు ఇల్లీగల్‌గా రవాణా చేస్తున్నారు. మైనింగ్‌శాఖకు ఖనిజాల ద్వారా జిల్లా నుంచి ఏటా 80 కోట్ల రూపాయల వరకు ఆదాయం సమకూరుతోంది. ఖనిజాలలో అధికంగా నాపరాయి ద్వారానే ఆదాయం ఎక్కువగా ఉంటుంది. మిగిలిన ఖనిజాలలో ల్యాటరైట్, సుద్ధ, మొరం, కంకర ద్వారా రూ.30 కోట్ల వరకు రాబడి వస్తుంది.

మిగిలిన యాబై కోట్ల రూపాయల ఆదాయంలో నాపరాతి నిక్షేపాల నుంచి వచ్చాయి. అందులో ఎక్కువగా సిమెంట్ పరిశ్రమలకు ఇచ్చిన లీజుల ద్వారా అధిక ఆదాయం చేకూరుతుంది. కొంతకాలంగా ఆదాయానికి భారీగా గండి పడినట్లు తెలిసింది. ప్రతియేటా ప్రభుత్వం ఆదాయం టార్గెట్‌ను నిర్ధేశిస్తున్నది.

గత యేడాది కంటే అదనపు ఆదాయం సాధించాలని ఆదేశిస్తున్నా ఇక్కడ అమలు కావడం లేదని తెలుస్తున్నది. ఇక్కడ రూ.10 కోట్లకు మించి రాబడి చేకూరడం లేదని సమాచారం. కర్ణాటక నుంచి జీరోగా తాండూరుకు నాపరాయి రవాణా జరుగుతోంది.

ఓగీపూర్, సంగెం కలాన్, కరణ్‌కోట ప్రాంతాల నుంచి ఎక్కువగా అక్రమంగా తరలి స్తున్నారు. రోజూ 10 నుంచి 20 రాయల్టీల రశీదులు ఇస్తూ వందల సంఖ్యలో వాహనాలను రవాణా చేస్తున్నారు. అంటే 70 శాతం ఇల్లీగల్‌గా నాపరాయి రవాణా చేస్తూ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు.

ఈ లారీలపై వసూళ్లకు ప్రైవేటు వ్యక్తులను నియమిం చుకుని నిరాటంకంగా దందా చేపడుతున్నారు. పలుచోట్ల చెక్ పోస్టులను ఏర్పాటు చేసుకుని లారీల నుంచి అక్రమంగా వసూలు చేస్తున్నారు. దీనిపై కొరడా జులిపించాల్సిన అధికారుల జాడ కనిపించడం లేదు.

### నిబంధనల అమలు ఎక్కడ?

కొంతకాలంగా ప్రభుత్వ గని భూములకు, పట్టా భూములకు లీజులు ఇవ్వడంలో జాప్యం జరుగుతోంది. ఒకవేళ పట్టా భూముల్లో ఎకరా గనికి లీజులు ఇవ్వాలంటే వ్యాపారికి తడిసి మోపెడు అవుతోంది. ఎకరా గనికి లీజు పొందాలంటే రూ.14 లక్షల వరకు వ్యయం అవుతోంది. సెక్యూరిటీ డిపాజిట్, పర్యావరణ అనుమతులు, రాయల్టీ తదితర వాటికి ఇంత మొత్తంలో ఖర్చు అవుతుంది. ఇటీవల గ్రీన్ ట్రిబ్యునల్ ద్వారా అనుమతులు పొందాలనే నిబంధనలు పెట్టారు. గతంలో ఒక ఎకరా గని భూమి లీజుకు రూ.2 లక్షలు మాత్రమే ఉండేది. ప్రస్తుతం లీజు వేసే అప్లికేషన్ ధరావతు రూ.లక్ష, రూ.4 లక్షలు డిపాజిట్, ఈసీకి లక్షన్నర, సెక్యూరిటీ డిపాజిట్ రూ.2 లక్షలు, డెడ్ ఎండ్‌కు రూ.2 లక్షలు, పర్యవేక్షణకు రూ.60 వేలు నిర్ణయించారని సమాచారం. ఇంత మొత్తం చెల్లించి గనులు తవ్వేందుకు వ్యాపారులు వెనకంజ వేస్తున్నారు. రాయల్టీ మన రాష్ట్రంలో 100 చదరపు అడుగులకు రూ.2700 ఉండగా పక్కనే ఉన్న కర్ణాటకలో రూ.800 మాత్రమే అమలు చేస్తున్నట్లు సమాచారం. కర్ణాటక నుంచి కేవలం 10 కిలోమీటర్ల దూరంలో గల కర్ణాటక నుంచి నిత్యం నాపరాయి రవాణా జరుగుతుంది. తరుగు తీసి గనులు తవ్వేందుకు వ్యాపారులకు పెద్ద మొత్తంలో ఖర్చు అవుతుందని భావించి ఇల్లీగల్‌గా దందా సాగిస్తున్నారు. ఈ నిబంధనలు పెద్దగా అమలు చేయడం లేదని తెలుస్తున్నది.

### పాత లీజులపైనే బడా వ్యాపారుల తవ్వకాలు

కొంతమంది స్థానికేతర, స్థానిక బడా వ్యాపారులు పాత లీజులపైనే తవ్వకాలు చేపట్టారు. కొంతమంది దౌర్జన్యంగా దందాలు చేపట్టారు. లీజులు, రాయల్టీల రూపేణా రూ.10 కోట్లకు మించడం లేదని సమాచారం. ఉమ్మడి రంగారెడ్డి, ఉమ్మడి మెదక్, భువనగిరి జిల్లాల్లో పలుచోట్ల అక్రమ మైనింగ్ జరుగుతున్నట్లు ఉన్నతాధికారులు గుర్తించారు. గని యజమానులు, పాలిషింగ్ యూనిట్ల యజమానులు తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. 24 గంటల పాటూ కెమెరాలు పని చేసేలా చొరవ తీసుకోవాలని, ఎక్కడైనా అవి పని చేయకుంటే కఠినంగా వ్యవహరిస్తామని అధికారులు స్పష్టం చేశారు. అక్రమంగా విద్యుత్ కనెక్షన్లను తొలగించారు. ఇంకా పలుచోట్ల తొలగించాల్సి ఉంది. కెమెరాల ఏర్పాటుకు చాలామంది వ్యాపారులు వెనకంజ వేశారు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన భూములలో చాలామంది లీజులు లేకుండా గనులు తవ్వకాలు మిగతా 4లో



హద్దుల కోసం ఏర్పాటు చేసుకున్న సిమెంట్ రాళ్లను తొలగించిన దృశ్యం

# నందిగామలో సీలింగ్ సెగలు

### ఆంక్షలున్నా హద్దులు దాటిన రైతులు
### జెసిబితో హద్దులను తొలగించిన అధికారులు
### కోర్టుకెళతామంటూ అన్నదాతల ఆందోళన

**నందిగామ, నవంబరు 2, ప్రభాతవార్త :** నందిగామలో రెవెన్యు పరిధిలో సర్వే నెంబరు 621/2లో గత కొన్నేళ్లుగా రగులుతున్న సీలింగ్ భూముల వ్యవహారం చిలికి చినికి గాలి వానలా మారి కోర్టు కెక్కింది. సీలింగ్ భూమిలోఎలాంటి నిర్మాణాలు చేపట్టొద్దని ప్రభుత్వ హెచ్చరికలు జారీచేశారు. ఇటీవల కొందరు రైతులు వినకుండా సిమెంటు కడ్డీలతో హద్దులు వేసుకున్నారు. ఇది తెలిసిన అధికారులు పాతుకున్న కడ్డీలను జెసిబితో తొలగించారు. సీలింగ్ భూమికి సంబంధించిన రైతులు వ్యవసాయ సాగు తప్ప ఏ విధమైన బౌండరీలు, ప్రహరీలు నిర్మించుకోవద్దని ఎమ్మార్వో సైదులు సూచించారు. గతంలో సీలింగ్ భూముల్లో ప్రహరీ కోసం సిమెంట్ ఫ్రీ కాస్టింగ్ పలకలను వేసుకుంటే అప్పట్లో వాటిని రెవెన్యూ యంత్రాంగం తొలగించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. తమ భూమి సరిహద్దుల్లో ప్రహరీ కోసం ఏర్పాటు చేసుకున్న సిమెంట్ రాళ్లను తొలగించడం అన్యాయమని, తమకు ముందస్తు సమాచారం ఇచ్చి ఉంటే బాగుండేదని బాధిత రైతు కుమారుడు పాశం వెంకటేష్ విచారం వెలిబుచ్చారు. ఈ విషయమై న్యాయం కోసం తాను పోలీస్, రెవెన్యు ఉన్నతాధికారులను ఆశ్రయిస్తున్నట్లు తెలిపారు. ఏది ఏమైనా ఈ సీలింగ్ వ్యవహారం ఎంతకు దారితీస్తుందో వేచి చూడాల్సిందే.

## మద్యానికి బానిసై ఉరివేసుకుని ఆత్మహత్య

**మర్పల్లి, నవంబరు 2 ప్రభాతవార్త:** ఉరివేసుకోని ఒక వ్యక్తి ఆత్మ హత్య చేసుకున్న సంఘటన మర్పల్లి మండల కేంద్రంలోని కొత్తాపూర్ గ్రామంలో అదివారం నాటు వెలుగు చూసింది. కొత్తాపూరం గ్రామానికి చెందిన చామల మొహన్‌రెడ్డి (34) అనే వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి బార్య చామల మమత, మర్పల్లి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు వివరాలు ఇలా ఉన్నాయి. తన భార్త రోజు మద్యం తాగి వచ్చి మద్యం మత్తులో కుటుంబ సభ్యులతో గొడవ పడేవాడని, గత నెల 24 వతేదీ రాత్రి మద్యం తాగి వచ్చి గొడవ పడ్డాడని చెప్పింది. తన మామ పాండురంగారెడ్డి మందలించారని తెలిపింది. మరుసటి రోజు ఉదయం తమ కుమారుడు కౌశిక్‌రెడ్డి, నాతో పాటు జహీరాబాద్ వెళ్దామని కారులో తీసుకెళ్ళాడు మిగతా 4లో

# తాచెడ్డ కోతి..ఊరూరా అల్లరి

**ధారూర్ మండలంలో వీరవిహారం**

**పొలాల మీద మూకుమ్మడిగా దాడి**

**పంటలన్నింటినీ ధ్వంసం చేస్తున్న వానరాలు**

**ఇళ్లలోకీ చొరబాటు.. చిన్న పిల్లలపై దాడి**

**నియంత్రణ చర్యలకు స్థానికుల డిమాండ్**

**ధారూరు, నవంబరు 2 ప్రభాతవార్త:** ధారూర్ మండలంలోని అన్ని గ్రామాల్లో కోతుల వలన రైతులు, ప్రజలు భయాం దోళనలకు గురి అవుతున్నారు. అన్ని గ్రామాల్లో రోజు రోజుకు కోతుల సంఖ్య పెరుగుతూ, ఇండ్ల మీద వీర విహారం చేస్తూ ప్రజల ు భయ పెడుతూ.. ఇండ్లలో ఉన్నటువంటి ఆహారాన్ని ఎత్తుక పోతున్నాయని, మ నుషుల మీదికి తిరగబడుతూ కరుస్తున్నాయి. చిన్నపిల్లలు బయటకు వెళితే వారి మీద దాడికి పాల్పడుతున్నాయని పంట పొలాల మీద మూకుమ్మడిగా దాడి చేస్తూ వరి, పత్తి, మొక్కజొన్న, కూరగాయ, తోటల ు నాశనం చేస్తూ రైతులకు నష్టాన్ని కలిగిస్తున్నాయి. రైతులు పొలాల వద్ద ఏ పంట వేసిన దక్కకుండా కోతులు నాశనం చేస్తున్నాయని వాపోతున్నారు. రైతులు కోతుల బెడద నుండి తప్పించుకోవడానికి ఎన్ని ప్రయత్నాలు చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. కోతుల బాధల వలన పంటలు వేసుకోలేక పోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం లేచినప్పటి నుంచి పొలాల వద్దనే మిగతా 4లో





రోడ్లపై సంచరిస్తున్న వీధి కుక్కలు(ఇన్‌సెట్) కుక్కకాటుకు గురైన బాలుడు

# కోర్టు ఆదేశించినా .. చలనం లేదా!

### మోత్కుపల్లిలో వీధి వీధిలో గ్రామసింహాల వీరంగం
### హడలిపోతున్న గ్రామస్తులు
### డాగ్ షెల్టర్లకు తరలించాలని డిమాండ్

**కోట్‌పల్లి, నవంబరు, 2, ప్రభాతవార్త:** వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి మండల పరిధిలోని మోత్కుపల్లి గ్రామంలో గ్రామ సింహాలు ప్రజలపై దాడులతో వణికిస్తూ, స్వైరవిహారం చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. దింతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కోట్‌పల్లి మండలంలోని, కోట్‌పల్లి, మోత్కుపల్లి, బార్వాద్, నాగసాన్‌పల్లి, తదితర గ్రామాలల్లో శునకాల సమస్య జఠిలంగా మారింది. వీధి కుక్కలపై నియంత్ర చర్యలు లేకపోవడంతో పల్లెల్లో కుక్కలు గుంపులు గుంపులు తిరుగుతూ స్వైరవిహారం చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. వీధి కుక్కల వల్ల రోడ్లపైకి రావలంటేనే ప్రజలు భయడుతున్నారు. ఇక రాత్రి అయితే వాటి అరుపులు, ఉరుకులకు ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఈ క్రమంలోనే సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. వీధి కుక్కలను వీలైనంత త్వరగా డాగ్ షెల్టర్లను ఏర్పాటు చేసి తరలించాలని అదేశించింది. ఏదైనా సంస్థ మిగతా 4లో

# ఆమె వేధింపులు

# ఇక భరించలేం

## తక్షణం ఇక్కడి నుంచి బదిలీ చేయండి

### షాద్‌నగర్ గురుకుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ తీరుపై విద్యార్థినుల ఆందోళన



ధర్నా చేస్తున్న గురుకుల కళాశాల విద్యార్థినులు

**దాదాపు 500 మంది పట్టణ చౌరస్తా వరకూ ర్యాలీ**

**నడిరోడ్డుపై బైఠాయింపు**

**చాలీచాలని భోజనం పెడుతోందని ధ్వజం**

**వివాహం అయిన విద్యార్థినులు గురుకులంలో చేరాలంటే కట్నంలో సగం ఇవ్వాలని డిమాండ్ చేస్తోందని వెల్లడి**

**మెస్ సరుకులు యథేచ్ఛగా బయటకు తరలిపోతున్నాయని ఆరోపణ**

**ఉదయం నుంచి సాయంత్రం వరకూ అన్నపానీయాలు లేకుండా నిరసన**

**షాద్‌నగర్, నవంబరు 2, ప్రభాతవార్త :** షాద్‌నగర్ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వేధింపులు మితిమీరి పోవడంతో విద్యార్థినులు ఆదివారం తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. దీర్ఘకాలంగా మౌనంగా భరిస్తున్న వారికి సహనం నశించటంతో రోడ్డెక్కారు. దాదాపు 500 మంది పట్టణ చౌరస్తా వరకూ ర్యాలీగా వెళ్లి నడి రోడ్డుపై రాస్తారోకో చేశారు. ప్లకార్డులు పట్టుకుని ప్రిన్సిపల్ వేధింపుల తీరును ఎండగట్టారు. ఈ సందర్భంగా గురుకులంలో గూడుకట్టుకున్న దారుణాలు వెలుగుచూశాయి. కళాశాల ప్రిన్సిపల్ శైలజ గతంలో కూడా సూర్యాపేట గురుకుల కళాశాలలో అనేక ఆరోపణలు ఎదుర్కొన్నారు. మద్యం బీర్ల సంఘటన నేపథ్యంలో అక్కడి నుంచి ఆమెను షాద్‌నగర్ బదిలీ చేశారు. ప్రిన్సిపల్ వేధింపుల తీరును బాధిత విద్యార్థినులు మీడియాకు వివరించారు. ఆమె కొంచెం కూడా మానవత్వం లేకుండా ప్రవరిస్తున్నారని వాపోయారు. 500 మందికి 20 కేజీల మటన్ వస్తే అందులో కొంత ప్రిన్సిపల్ దాచుకుని తమకు చాలీచాలని భోజనం పెడుతోందని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం మిగతా 4లో

### ఉద్రిక్తతకు దారితీసిన ధర్నా

**విద్యార్థినిపై చేయి చేసుకున్న మహిళా కానిస్టేబుల్‌ను జుట్టుపట్టి ఈడ్చేసిన విద్యార్థినులు**

వివరాలు మెయిన్‌లో

### గురుకులంలో కలకలంపై సుదీర్ఘ విచారణ

**రంగంలోకి దిగిన సంక్షేమశాఖ జోనల్ చైర్మన్**

**ప్రిన్సిపల్ వేధింపులపై అధికారుల ఆరా**

**ప్రత్యేక బృందంతో నిజానిజాలు నిగ్గుతేల్చి చర్యలు తీసుకుంటామని హామీ**

4



మాట్లాడుతున్న ఎంపి ఈటెల రాజేందర్

## కంటోన్మెంట్ బోర్డు ప్రాంతాల అభివృద్ధికి కృషి

### ఎంపి ఈటల రాజేందర్

**కంటోన్మెంట్, నవంబరు 2 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని వివిధ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తానని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ తెలిపారు. ఆదివారం 5వ వార్డు న్యూ వాసవీ నగర్ సెక్టార్ ఏ కాలనీలో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. వాసవీ కాలనీలో నెలకొన్న రోడ్లు, డ్రైనేజీ, మంచి నీరు వంటి సమస్యలు ఏమైనా ఉంటే బోర్డు మెంబర్ బానుక నర్మద దృష్టికి తీసుకు రావాలని ఆయన సూచించారు. వాటి పరిష్కారానికి అన్ని విధాలా కృషిచేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా కాలనీ నూతన కార్య వర్గాన్ని అయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సామాజిక కార్యకర్త తేలుకుంట సతీష్ గుప్త, కాలనీ అధ్యక్షుడు వినయ్, కార్యదర్శి వేణను, కోశాధికారి శివ, కాలనీ ప్రతినిధులు మహేశ్, దాచే పల్లి వెంకట క్రిష్ణ, బచ్చు అమర్‌నాథ్, జి.గౌరి శంకర్,లక్ష్మి నారాయణ, వినోద్, రాచమల్ల అజయ్, లక్ష్మణ్ రావ్ తదితరులు పాల్గొన్నారు.

## 'యాదవులు అన్ని రంగాల్లో రాణించాలి'



ఆంజనేయులుకు నియామకపత్రాన్ని అందజేస్తున్న రాములుయాదవ్

**సైఫాబాద్, నవంబరు 1 ప్రభాతవార్త:** యాదవులు అన్ని రంగాల్లో రాణించాలని, ముఖ్యంగా చట్టసభలలో ప్రాతినిధ్యం సాధించాలని జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు రాములుయాదవ్ పిలుపు నిచ్చారు.లేకపోతే యాదవులు కాలగర్భంలో కలిసిపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన యాదవుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యాదవులు ఆర్థిక, రాజకీయ, సామా జిక రంగాలలో రాణించాలని, యాదవ జాతిని కాపాడుకోవాలని, జాతికి అంకితం కావాలని పిలుపునిచ్చారు.జాతీయ యాదవుల ప్లీనరీ సమావేశం లో హైదరాబాద్ నగరంలో పెద్దఎత్తున ఫిబ్రవరి మాసంలో నిర్వహిస్తున్నా మని చెప్పారు. ప్లీనరీ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన నల్లగొండ జిల్లా యాదవ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడిగా ఎన్.ఆంజేయులు, రంగారెడ్డిజిల్లా అధ్యక్షుడిగా భద్రి రమేష్‌ను నియమించారు. సమావేశంలో సమితి రాష్ట్ర అధ్యక్షుడు దేవేందర్‌యాదవ్, కార్యనిర్వాహక అధ్యక్షుడి పి.శ్రీనివాస్, లక్ష్మి, నాయకులు నర్సయ్య యాదవ్, పరుశురామ్‌యాదవ్, శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలు పరిష్కరించడంలో అధికారులు విఫలం

### బిజెపి నేత కట్ల అశోక్



కార్వాన్ లో డ్రైనేజీ పనులు చేయిస్తున్న కట్ల అశోక్

**మెహిదీపట్నం నవంబరు 2, ప్రభాతవార్త :** ప్రజా సమస్యలు పరిష్క రించడంలో అధికారులు విఫలమయ్యారని బిజెపి కార్వాన్ డివిజన్ కంటె స్టెడ్ కార్పొరేటర్ కట్ల అశోక్ ఆరోపించారు. ఆదివారం కార్వాన్ డివిజన్ లోని భాంజవాడి, సాహూ కార్వాన్ బస్తీలలో పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... భాంజవాడి, సాహూ కార్వాన్ బస్తీలలో గత కొద్ది రోజులుగా కలుషిత జలాలు, డ్రైనేజీ సమస్యలు నిత్య కృత్యంగా మారాయన్నారు. సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోకపోవడంతోనే సమస్యలు నెలకొంటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. బస్తీలలోని స్థానిక ప్రజలు అధికారులకు ఫిర్యాదు చేస్తే సమస్యలను ఎందుకు పరిష్కరించడం లేదని ప్రశ్నించారు. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలం చెందిన అధికారులపై వేటువేయాలని డిమాండ్ చేశారు.

## ఆల్ సోల్స్‌డే ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న ఎమ్మెల్యే



పాదర్ ఆశీర్వచనం స్వీకరిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

**సికింద్రాబాద్, నవంబరు 2 ప్రభాతవార్త :** మరణం భౌతికంగా వ్యక్తు లను దూరం చేసినప్పటికీ, వారి జ్ఞాపకాలు, ప్రేమ మాత్రం శాశ్వతంగా ఉంటుందని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఆదివారం ఆత్మల దినం (ఆల్ సోల్స్ డే) సందర్భంగా బన్సీలాల్ పేట డివిజన్‌లోని బోయగూడలోగల క్రిస్టియన్‌గ్రేవ్ యార్డ్‌లో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొన్నారు. ప్రార్థనల అనంతరం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ను పాదర్ ఆశీర్వచనం చేశారు. ప్రార్థనల నిమిత్తం గ్రేవ్ యార్డ్‌కు వచ్చిన వారికి ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ వ్యక్తిగతంగా బిస్కెట్స్, వాటర్ బాటిల్స్, జ్యూస్ లను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే వెంట కార్పొరేటర్ కుర్మ హేమలత, పద్మారావునగర్ బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు వెంకటేషన్‌రాజు, మాజీ ఎమ్మెల్సీ స్టీఫెన్‌సన్, పాదర్ ఆరోగ్యం, గ్రేవ్‌యార్డ్ కమిటీ సభ్యులు జయరాజ్, జ్యుట్‌పాల్, నాయ‌కులు మహేందర్ గౌడ్, అంబులెన్స్ సురేష్, కొత్తూరు వెంకట్, సుధాకర్‌రెడ్డి,శ్రీనివాస్ ఉన్నారు.

## ఎం.ఎల్.నరసింహారావు సాహితీ సేవాపురస్కారం

**నాంపల్లి, నవంబరు 2 ప్రభాతవార్త :** డా. ఎం.ఎల్.నరసింహారావు జయంతిని పురస్కరించుకుని ప్రముఖ రచయిత, కవి, అనువాదకుడు ఎలనాగకు డా. ఎం.ఎల్.నరసింహారావు సాహితీ సేవాపురస్కారం బహూకరించనున్నట్లు శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషానిలయం గౌరవ కార్యదర్శి టి.ఉదయవర్లు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, తెలుగు భాషానిలయం అధ్యక్షుడు డా. కె.వి.రమణాచారి అధ్యక్షతన 9వ తేదీ ఆదివారం రాత్రి 6గంటలకు భాషానిలయంలోని రావిచెట్టు రంగారావు సభావేదికలో జరిగే ఈ కార్యక్రమానికి సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు ముఖ్యఅతిథిగా విచ్చేసి ఆత్మీయ అతిథి ఒయు విశ్రాంతాచార్యుడు డా. మసన చెన్నప్ప తదితరులతో కలిసి ఎలనాగను ఘనంగా సత్కరించి సాహితీ సేవాపురస్కారం బహూకరిస్తారని, అధిక సంఖ్యలో సాహితీప్రియులు, ఔత్సాహిక ప్రేక్షకులు విచ్చేసి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఉదయవర్లు కోరారు.

# బిసిల రిజర్వేషన్‌లు అన్ని విభాగాల్లో అమలు చేయాలి

### తెలంగాణ బిసి లాయర్స్ అసోసియేషన్




మాట్లాడుతున్న తలకొక్కుల రాజు

**సైఫాబాద్, నవంబరు 2 ప్రభాతవార్త:** న్యాయ వ్యవస్థలోని అన్ని విభాగాల్లో, సంస్థల్లో బిసి రిజర్వేషన్‌లు అమలు చేయాలని తెలంగాణ బిసి లాయర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ముఖ్యంగా హైకోర్టు,సుప్రీంకోర్టు జడ్జిల నియామకాల్లో బిసిలకు అన్యాయం జరుగుతుందని, అన్ని విభాగాల్లోని నామినేటేడ్‌పోస్టులలో బిసిలకు సరైన ప్రాతినిధ్యం ఇవ్వడంలేదని, పబ్లిక్ ప్రాసిక్యూటర్స్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్స్, జిపి, ఎజిపి, స్టాడింగ్ కౌన్సిల్స్‌లో న్యాయం చేయాలని అసోసియేషన్ కోరింది. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన బిసి లాయర్స్ అసోసియేషన్ అవిర్భావ సమావేశంలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తలకొక్కుల రాజు, పొన్నం దేవరాజుగౌడ్ మాట్లాడుతూ ప్రధాన శాఖాలన్ని అగ్రకులాల గుప్పిట్లో పెట్టుకుని ప్రాధాన్యత లేని పోస్టులలో బిసిలకు కేటాయించడం సమంజసం కాదన్నారు. ముఖ్యంగా ప్రభుత్వం కేటాయించిన బిసిల 42 శాతం రిజర్వేషన్‌లను అన్ని శాఖలలో అమలు చేయాలని, ఈ రిజర్వేషన్‌లను కేంద్ర ప్రభుత్వం 9వ షెడ్యూల్‌లో చేర్చాలని, ప్రభుత్వ శాఖాల్లోని నామినేటెడ్ పోస్టులలో బిసిలకు 42 శాతం కేటాయించాలని, బార్ కౌన్సిల్ ఎన్నికల్లో రిజర్వేషన్‌ల విధానాన్ని అమలు చేయాలని, జూనియర్ న్యాయవాదులకు నెలకు 30 వేలు స్టైఫండ్ చెల్లించాలని వారు కోరారు. పై డిమాండ్ల సాధన కోసం ఈ నెల 29న ఒక సదస్సు ఏర్పాటు నిర్వహిస్తున్నామని, ఈ సందర్భంగా అసోసియేషన్‌కు నూతన కమిటీని ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు పూస మల్లేష్, ఎ.కోమరయ్య, జక్కుల వంశీకృష్ణ, రాజేశ్వర్, సాహితి తదితరులు పాల్గొన్నారు.

# కారణజన్ముడు ప్రధాని నరేంద్ర మోడీ

### రాజ్యసభ సభ్యుడు, బిజెపి ఒబిసి మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్




రాగం రచించిన యోగస్థ తెలుగు అనువాద పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్

**చిక్కడపల్లి నవంబరు 2 (ప్రభాతవార్త):** ప్రధాని నరేంద్ర మోడీ కారణజన్ముడని రాజ్యసభ సభ్యుడు, భాజపా ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్ అన్నారు. ఆదివారం వసుంధర బిల్డక్స్ ఆధ్వర్యంలో రాగం రచించిన యోగస్థ తెలుగు అనువాద పుస్తకావిష్కరణ కార్యక్రమం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ప్రాచీన కళలు, అలవాట్లు కనుమరుగవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు నేటి యువత పాశ్చాత్య సంస్కృతి మోజులో పడి పిజ్జాలు, బర్గర్ వంటివి తింటూ ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నారన్నారు. దీంతో చిన్నపాటి జబ్బులకే ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారని చెప్పారు. ప్రధాని నరేంద్రమోదీ మితమైన ఆహారం తీసుకుంటూ దేశానికి కీర్తిప్రతిష్టలు తీసుకొస్తున్నారని తెలిపారు. యోగా, మెడిటేషన్‌లో బలంగా ఉంటూ సమాజాన్ని మరింత బలంగా తయారుచేయాలని సూచించారు. సిద్దేశ్వర వంటి గురువులు సమాజానికి అవసరమన్నారు. దేశ సం పదైన యువత మత్తుపదార్థాలు, మద్యానికి బానిస లుగా మారి సమాజానికి, కుటుంబానికి భారం కాకూడదన్నారు. పుస్తకాలు చదివి దైనందిన జీవితంలో మార్పులు తెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పావని, వసుంధర బిల్డక్స్ వ్యవస్థాపక డైరెక్టర్లు పోతిరెడ్డి రమేష్‌బాబు, వరుణ్ అగర్వాల్, డైరెక్టర్ పోలీసపటేల్ శ్రీనివాస్‌రెడ్డి, గానసభ అధ్య క్షుడు కళా జనార్దనమూర్తి, ప్రముఖులు రాగం, పోతిరెడ్డి సందీప్, భాజపా సికింద్రాబాద్ పార్లమెంట్ సంయుక్త కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, ప్రముఖులు కె.రాహుల్, జంబునాథ్, నేతలు వీఎస్టీ రాజు, శ్రీకాంత్, ఎండీ మహమూద్ పాల్గొన్నారు.

# టిడిపి బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలి

### హైదరాబాద్ పార్లమెంట్ సమన్వయకర్త సురేందర్‌సింగ్



కార్వాన్‌లో జరిగిన సమావేశంలో పాల్గొన్న సురేందర్ సింగ్, బుగిడి అనూప్ కుమార్

**మెహిదీపట్నం, నవంబరు 2, ప్రభాతవార్త :** తెలుగుదేశం పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ముందుకు వెళ్లాలని ఆ పార్టీ హైదరాబాద్ పార్లమెంట్ సమన్వయకర్త సురేందర్‌సింగ్ కోరారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో వ్యవహరించాల్సిన తీరుపై ఆదివారం కార్వాన్‌లో నియోజకవర్గస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా సురేందర్ సింగ్, మాజీ రాష్ట్ర అధికార ప్రతినిధి బుగిడి అనూప్ కుమార్ హాజరై మాట్లాడారు...జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి బలమైన క్యాడర్ ఉందని గుర్తు చేశారు. నియోజకవర్గంలో టిడిపి ఓట్లే గెలుపు ఓటములను ప్రభావితం చేస్తాయన్నారు. అలాంటి జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి పోటీలో లేకపోవడం బాధాకర విషయమన్నారు. ఉప ఎన్నికలో టిడిపి నాయకులు, కార్యకర్తలు తటస్థంగా వ్యవహరించాలని కోరారు. అదేవిధంగా కార్వాన్ నియోజకవర్గంలో టిడిపి పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. రానున్న జిహెచ్ఎంసి ఎన్నికల్లో నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో అభ్యర్థులు పోటీ చేయాలని కోరారు. సమావేశంలో నర్సింగ్‌రావు, నితీష్ సింగ్, ఖైరుద్దీన్, చంద్ర కిరణ్, శీను, రితీష్‌లు పాల్గొన్నారు.

## డాక్టర్ సి.నారాయణరెడ్డి యాదిలో... సినీ గీతాలాపన

**చిక్కడపల్లి నవంబరు 2 (ప్రభాతవార్త):** రాష్ట్ర ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఆదివారం చిక్కడపల్లి త్యాగరాయణ గానసభలోని కళావెంకటదీక్షితులు కళావేదికలో కల్పనా కళానికేతన్ అధినేత, ప్రముఖ రంగస్థల కళాకారుడు జంగయ్యగౌడ్ ఆధ్వర్యంలో జ్ఞానపీఠ్ పురస్కార గ్రహీత డాక్టర్ సి.నారాయణరెడ్డి యాది కార్యక్ర మంలో భాగంగా తెలుగు, హిందీ సినీ గాన మందార మకరందం పేరు తో సినీ గీతాలాపన కార్యక్రమం జరిగింది. ప్రముఖ రంగస్థల నటులు, ఇండియన్ నేషనల్ థియేటర్ ప్రధాన కార్యదర్శి డి.నాగేందర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సింగరేణి కాలరీస్ పూర్వ ఎగ్జిక్యూటివ్‌డైరెక్టర్ ఇ.భుమారావు హాజరుకాగా కార్యక్రమంలో న్యాయవాది పొన్నం శ్రీనివాస్‌రావు, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

## అయ్యప్పస్వాములు పాదయాత్రను ప్రారంభం

**కంటోన్మెంట్, నవంబరు 2 ప్రభాతవార్త:** అయ్యప్ప స్వామి నామ స్మరణ ఎంతో మధురమని మోండా డివిజన్ సీనియర్ కాంగ్రెస్ నేత, చిర్రబోయిన సంతోష్‌యాదవ్ అన్నారు. మోండా డివిజన్‌లోని ఈస్ట్ మారేడ్‌పల్లిలోని లోహియానగర్ ప్రాంతాలకు చెందిన అయ్యప్ప స్వాములు అదివారం వైఎంసీఏ సమీపంలోని సిద్ధి వినాయక టెంపుల్ నుంచి శబరిమలకు పాద యాత్రగా వెళ్తున్నవారికి సహాయ సహకారాలు అందించి మహా పాదయాత్ర లను ప్రారంభించారు. ముందుగా ఆలయంలో పూజలు నిర్వహించి అనం తరం జెండా ఊపి అయ్యప్ప స్వాముల పాదయాత్రను ప్రారంభించారు.

## సమాజ సంక్షేమంలో కమ్మకులస్థుల పాత్ర అమోఘం

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, నవంబరు 2 ప్రభాతవార్త :** సమాజంలో అట్టడుగు వర్గాల సంక్షేమానికి కమ్మకులస్థుల కృషి హర్షనీయమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం కమ్మసంఘ కార్తీక వనభోజనాలు బహాదూర్‌పల్లి సాయినాథ్ సొసైటీ ఆవరణలో జరిగాయి. ఈసందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ కమ్మ సంఘం ఆధ్వర్యంలో ప్రతిసంవత్సరం నిర్వ హించే కార్తీక వనబోజనాలకు ఎంతో ప్రత్యేకత ఉందన్నారు. సమాజంలోని అట్టడుగు వర్గాల సంక్షేమానికి సంఘ నిర్వాహకులు చేస్తున్నకృషి అభినంద నీయమన్నారు. కెజిఎఫ్‌చైర్మన్ కుసుమకుమార్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తం గా ఉన్న కమ్మకులస్తులను ఏకంచేసి రానున్న రోజులలో కమ్మ ఖ్యాతి నలు దిశలా చాటేందుకు కృషిచేయాలని పిలుపునిచ్చారు. పలువురు ప్రముఖులు కమ్మవారిసేవలను వివరించారు. కార్యక్రమంలో సినీ ప్రముఖులు రఘు, భవాణి, కూకట్‌పల్లి కాంగ్రెస్‌పార్టీ ఇంచార్జి బండి రమేశ్, మన్నె సతీష్ కుమార్, అడుసు మిల్లి శ్రీనివాసరావు, అప్పసాని రాజేశ్, మాజీ కార్పొరేటర్ బొడ్డు వెంకటేశ్వరరావు,, కుత్బుల్లాపూర్ కమ్మ సంఘ అధ్యక్షులు బొడ్డు రవిశంకర్ రావు, ప్రధాన కార్యదర్శి బొబ్బా రంగారావు, గౌరవ అధ్యక్షులు సుంకవెల్లి వీరబాబు, బొడ్డు అశోక్‌రావు కమ్మసంఘ కార్యవర్గ ప్రతినిధులు పాల్గొని అతిథులను సత్కరించారు.

# శ్రీవేంకటేశ్వరస్వామి అద్భుతాల సమాహారమే హరే శ్రీనివాస! పుస్తకం



హరే శ్రీనివాస! పుస్తక రచయిత రమణాచారిని సత్కరిస్తున్న వేణుగోపాల్, బాలాచారి, దైవజ్ఞశర్మ

**రవీంద్రభారతి, సెప్టెంబరు 2 ప్రభాతవార్త :** తిరుమల తిరుపతి దేవస్థానాల కార్యనిర్వహణ అధికారి(ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్-ఈఓ)గా డా. కె.వి.రమణాచారి ఆ కలియుగం దైవం శ్రీవేంకటేశ్వరస్వామికి అనితర సేవలందించడంలో ఎదురైన పరీక్షలు, పరాజయాలు, దిగ్విజయాల అద్భుతాల సమాహారమే ఆయన రచించిన 22 శీర్షికల 192 పేజీల హరే శ్రీనివాస! పుస్తకమని వక్తలు అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాహిత్య అకాడమీ ప్రతిష్టాత్మకం నిర్వహిస్తున్న సాహిత్యవారంలో ఈవారం విశ్రాంత ఐఎఎస్ అధికారి, తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి రచించిన హరే శ్రీనివాస... పుస్తక పరిచయం ఆసక్తికరంగా జరిగింది. తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డా. నామోజు బాలాచారి సభాధ్యక్షతన రవీంద్ర భారతిలోని సమావేశ మందిరంలో జరిగిన ఈ పుస్తక పరిచయం కార్యక్రమానికి కాళోజీ అవార్డు గ్రహీత డా. అమ్మంగి వేణుగోపాల్ ముఖ్యఅతిథిగా, దూరదర్శన్ పూర్వకార్యక్రమ నిర్వహణాధికారి డా. ఓలేటి పార్వతీశం గౌరవ అతిథిగా, తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి, సరస్వతి ఉపాసకుడు దైవజ్ఞశర్మ ఆత్మీయ అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. శ్రీ వేంకటేశ్వర భక్తిఛానల్ (ఎస్‌విబిసి), అఖండ హరినామ సంకీర్తన సంకల్పంతో 2007వ సంవత్సరంలో మొదలైన గోవిందా-గోవిందా నామస్మరణ నేటికీ జాజ్జ్వల్యమానంగా సాగుతూనే ఉందన్నారు. అలాగే అశేష భక్తుల సౌకర్యార్థం వైకుంఠం క్యూకాంప్లెక్స్‌ను ఎయిర్ కండిషన్డ్ చేయించడం, వృద్ధులకు, వికలాంగులకు నేరుగా ప్రత్యేక దర్శన సదుపాయాలు, తరిగొండ అన్నమాంబ అన్నప్రసాద మందిరంలో ఉచిత భోజనం, చంటిపిల్లల తల్లిదండ్రులకు మహాద్వారం నుండి నేరుగా దర్శనం ఇలా మరెన్నో అద్వితీయ సదుపాయాలు సంకల్పసిద్ధితో, స్వామివారి కృపతో డా. కె.వి.రమణాచారి భక్తుల కోసం సాధించారని గుర్తుచేశారు. చివరిగా పుస్తక రచయిత డా. కె.వి. రమణాచారిని జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి అధికసంఖ్యలో సాహితీవేత్తలు, ఔత్సాహిక ప్రేక్షకులు విచ్చేసి కార్యక్రమాన్ని సుసంపన్నం చేశారు.



ఆలయంలో పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

## శివలింగం ప్రతిష్ట పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే

**సికింద్రాబాద్, నవంబర్ 2 ప్రభాతవార్త :** కార్తీక మాసం మహా శివుడికి ఎంతో ప్రీతిపాత్రమైన మాసం అని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆదివారం బన్సీలాల్ పేట డివిజన్ బోయగూడ లో గల ఉప్పలమ్మ దేవాలయం ప్రాంగణంలో శివలింగం ప్రతిష్ట పూజలలో పాల్గొన్నారు. పూజల అనంతరం ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ను సన్మానించారు. కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు వెంకటేషన్ రాజు, నాయకులు ప్రేమ్, కొత్తూరు వెంకట్, నెరేళ్ళ రవి, శాంతి కుమార్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

## పండ్లు ఆకారంలో కార్ల ప్రదర్శన



సుధాకార్స్ మ్యూజియంలో ప్రదర్శనలోని కార్లు

**చార్మినార్, నవంబరు 2 ప్రభాతవార్త :** హైదరాబాద్ పాతబస్తీ బహదూర్‌పురలోని సుధాకార్స్ మ్యూజియం లో 25వ మ్యూజియం వార్షికోత్సవం సందర్భంగా చిన్నారులను ఆహ్లాద పరిచేలా రూపొందించిన తొమ్మిది కొత్త కార్లను సుధాకార్ మ్యూజియం వ్యవస్థాపకులు సుధాకర్ శనివారం పారంభించారు. పుచ్చకాయ, ఫైనాఫిల్, యాపిల్, ఆరంజి, జామ, టమాటో వంటి పండ్లు ఆకారంలో ఉండే కార్లుతో పాటు గ్లోబ్ ఆకారంలో ఉన్న కారు,ఇంటి ఆకారం కారు ప్రదర్శనలో ఉన్నాయని ఆయన తెలిపారు.

## నేడు పాతబస్తీలో విద్యుత్ వినియోగదారుల దినోత్సవం

**చార్మినార్, నవంబరు 2 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈ నెల 3వ తేదీన విద్యుత్ వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహించనున్నామని మీరాలం విద్యుత్ ఏడిఈ వెంకటేష్‌గౌడ్ తెలిపారు. పాతబస్తీ మీరాలం సబ్ స్టేషన్ వద్ద సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటలు వరకు విద్యుత్ వినియోగదారుల సమావేశం జరుగుతుందని ఆయన తెలియజేశారు. మీరాలం సెక్షన్, చందూలాల్ బారాదరి సెక్షన్, కిషన్‌బాగ్ సెక్షన్, అత్తాపూర్ సెక్షన్ ఏఈల పరిధులలోని విద్యుత్ వినియోగదారులు విద్యుత్‌కు సంబంధించిన సమస్యలు,కరెంటు బిల్లులకు చెందిన సమస్యలు, బిల్లులో పేరు మార్పిడి, చిరునామా మార్పులు, విద్యుత్ మీటర్లకు సంబంధించిన సమస్యలపై వినియోగదారులు వినతిపత్రాలు అందజేయవచ్చునని ఆయన తెలిపారు. మీరాలం సబ్ డివిజన్ కార్యాలయం, మీరాలం విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద జరగనున్న విద్యుత్ వినియోగదారుల దినోత్సవ కార్యక్రమంలో ఏడిఈతోపాటు ఆయా విద్యుత్ సెక్షన్ల ఏఈలు పాల్గొంటున్నారని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఏడిఈ వెంకటేష్‌గౌడ్ విజ్ఞప్తి చేశారు.

## చట్టసభలతో యాదవ కులస్థుల సంఖ్య పెరిగేందుకు సమిష్టి

### కృషి: బిసివై జాతీయ అధ్యక్షుడు రామ్‌చంద్రయాదవ్

**కుత్బుల్లాపూర్, నవంబరు 2 ప్రభాతవార్త :** ఉభయ రాష్ట్రాలలో యాదవ కులస్థులు చట్టసభలలో స్థానాలను కైవసం చేసుకునేందుకు సమిష్టి కృషి చేయాలని బిసివైపార్టీ అధ్యక్షుడు బోడె రామచంద్రయాదవ్ పిలుపునిచ్చారు. ఆదివారం కుత్బుల్లాపూర్ గోకుల యాదవ సంఘ ఆధ్వర్యంలో చింతల్ డివిజన్ పరిధి హెచ్ఎంటి కాలనీలోని శ్రీలక్ష్మివేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగాణంలో కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన కార్తీకమాస వనభోజన మహోత్సవ సమ్మేళనానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదవ కులస్థులు వర్గ విభేదాలకు తావివ్వకుండా ఐక్యతతో ముందుకు కొనసాగాలని సూచించారు. బిసిగా రానున్న రోజుల్లో తెలుగురాష్ట్రాలలో సత్తాచాటాలని కోరారు. ఇంతటి ఆహ్లాద వాతావరణంలో యాదవ కులస్తులను ఒకచోటికి చేర్చిన నిర్వాహకులను ఆయన అభినందించారు. కుత్బుల్లాపూర్ గోకుల యాదవ సంఘం అధ్యక్షుడు ఎల్. వెంకట్‌రావు మాట్లాడుతూ కుత్బుల్లాపూర్‌లో గోకులం చాలాపటిష్టంగా వుందన్నారు. సభా ఆవరణలో ఆర్.ఎన్.సి ఆసుపత్రి చింతల్ ఆధ్వర్యంలో ఆసుపత్రి డైరెక్టర్లు డా.రమేశ్, డా.విజయభారతి యాదవ్‌ల ఆధ్వర్యంలో ఉచిత వైద్యపరిక్షలు నిర్వహించి మందులు పంపిణీచేశారు. వన భోజనాలలో పిల్లలు, పెద్దలు ఆటపాటలు, క్రీడలతో సందడిచేశారు. కార్యక్రమంలో సంఘ గౌరవ అధ్యక్షులు రాజశేఖర్‌యాదవ్, కార్యనిర్వాహక అధ్యక్షులు కె.శ్రీనివాస్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి తిరుమలరాజు యాదవ్ ప్రతినిధులు అడ్వకేట్ మాల్యాద్రియాదవ్, బెనర్జియాదవ్, సుబ్బారావు యాదవ్, గాజుల శ్రీనివాస్‌యాదవ్, బిజెపి నేత జె.కె.శేఖర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## వేదాంత వర్ధిని కళాశాలలో పూజలు

**కంటోన్మెంట్, నవంబరు 2 ప్రభాతవార్త:** కార్తీక మాసం క్షీరబ్ధి ద్వాదశిని పురస్కరించుకొని ఓల్డ్‌ఎయిర్‌పోర్ట్‌లోని శ్రీవేంకటేశ్వర వేదాంతవర్ధిని సంస్కృతిక కళాశాలలో నిర్వహించిన గణపతి పూజలకు కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రుద్రాభిషేకం, సుదర్శన హోమం, తులసీ దామోదర కళ్యాణంవంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జనసేన అధ్యక్షుడు,హిమయత్ నగర్ టీటీడి అధ్యక్షుడు శంకర్ గౌడ్, ప్రిన్సిపాల్ బానోతు సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు గ్రౌండ్‌లో వాకర్స్‌కు ప్రత్యేక వసతులు ఏర్పాటు చేయాలి

**గోషామహల్, నవంబరు 2 ప్రభాతవార్త:** దశాబ్దల నుంచి గోషా మహల్ పోలీస్ గ్రౌండ్‌లో ప్రజలు ఉదయం, సాయంత్రం వాకింగ్ చేయడం జరుగుతుందని గోషామహల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్య క్షుడు, బిజెపి నేత గోపాల్‌జీ అన్నారు. ఆదివారం పోలీసు గ్రౌండ్‌లో జాతీయ పతకాలను పట్టుకుని గ్రౌండ్స్‌లో వాకర్స్ కోసం ప్రత్యేక వసతులు ఏర్పాట్లు చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోషామహల్ పరిసర ప్రాంతాల ప్రజలకు పోలీస్ గ్రౌండ్‌లో వాకింగ్‌కు ప్రత్యేక వసతులు ఏర్పాటు చేసే విధంగా సంబం ధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిజిపిలకు విజ్ఞప్తి చేశారు. చిన్నపిల్లల పార్క్, వాకింగ్ ట్రాక్, జీమ్ వాకింగ్ చేయడం కోసం ప్రత్యేక ట్రాక్ ఏర్పాటు చేయాలని విన్నవిం చినట్లు తెలిపారు. 33 ఏకరాల ప్రభుత్వ స్థలంలో 21 ఎక రాలు ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణానికి ఇచ్చినట్లు తెలిపారు. మిగతా 11 ఎకరాల స్థలాన్ని పోలీస్ విభాగం ఆధీనంలో ఉంది. పోలీసు గ్రౌండ్‌ను ఉస్మానియా ఆసుపత్రి కొత్త భవన నిర్మాణానికి ఇవ్వడం వల్ల వాకింగ్ వచ్చే ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదన్నారు. అదేవిధంగా పోలీసు లకు కేటాయించిన స్థలంలో చిన్నపిల్లల పార్క్,వాకింగ్ ట్రాక్, వాలీ బాల్, కబడ్డి, టెన్నిస్ కోర్టును ఏర్పాటు చేయాలని ప్రజలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు భగవాన్, టి. సంజయ్, పరాచిజైన్, కిషన్‌రాజ్ పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్‌లో బిజెపి ప్రచారం

**జూబ్లీహిల్స్, నవంబరు 2, ప్రభాతవార్త:** బీజేపీ ప్రచార జోరు పెంచింది. బీజేపీ నేతలు ఆదివారం రాత్రి జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని పలుడివిజన్లలో ప్రచారాన్ని పెంచాయి. ఇందులో భాగంగా రహమత్‌నగర్ డివిజన్‌లో పార్టీ అధ్యక్షుడు రామచంద్రరావు, షేక్‌పేటలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, వెంగళ్‌రావు నగర్ డివిజన్‌లో ఏపీ అధ్యక్షుడు మాధవన్‌లు ప్రచారాన్ని నిర్వహించారు. బీజేపీ అభ్యర్థికి ఓటు వేయాలంటూ కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న బిఎస్పి అగ్రనేతలు

## స్థానిక సంస్థల్లో సత్తా చాటుదాం

### అధికారంలోకి వస్తేనే సమన్యాయం

### బిఎస్పి రాష్ట్ర ఇన్చార్జ్ అత్తర్‌సింగ్‌రావు

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, నవంబరు 2, ప్రభాతవార్త :** బిఎస్పి అధికారంలోకి వస్తేనే పేద వర్గాలకు సమన్యాయం జరుగుతుందని ఆ పార్టీ రాష్ట్ర ఇన్చార్జ్, మాజీ ఎమ్మెల్సీ అత్తర్‌సింగ్‌రావు అన్నారు. డబ్బులతో గెలుపొందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు ధనవంతులకే న్యాయం చేస్తున్నారని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఎస్పి పోటీ చేసి సత్తా చాటుకోవాలని కార్యకర్తలకు సూచించారు. ఆదివారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోయిన చంద్రశేఖర్ ముదిరాజ్ అధ్యక్షతన తాండూరు పార్టీ ఆఫీసులో నిర్వహించిన ముఖ్య కార్య కర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అణగారిన వర్గాలకు, జాతులకు సమన్యాయం కోసం బీఎస్పీ నిర్విరామ పోరాటం చేస్తుందని అత్తర్‌సింగ్ రావు స్పష్టం చేశారు. బడుగు బలహీనవర్గాల ఓట్లను కొనుగోలు చేస్తామనే అభిప్రాయం ధనికవర్గాల్లో నెలకొందని, దాన్ని తుడిచి వేస్తామని హెచ్చ రించారు. ఓటర్లను కొనుగోలు చేయడమంటే సంతలో పశువులనుకున్నారా.. అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలకు సంక్షేమ పథకాలు ఎరగావేసి ధనికులు అధికారం చేపడుతున్నారని మండిపడ్డారు. రాబోయే రోజుల్లో ధనికులకు ఓటు వేయరాదని అత్తర్‌సింగ్ పిలుపునిచ్చారు. లేకుంటే అట్టడుగువర్గాలు బానిసలుగా మారే ప్రమాదం ఉంటుందన్నారు. బహుజనులు బిఎస్పి ద్వారా చట్టసభలకు వెళ్లాల్సిన అవసరం ఏర్పడిందని గుర్తు చేశారు. ఈ దేశం బాగుపడాలంటే మెజారిటీగా ఉన్న బిసిలలో మరింత రాజకీయ చైతన్యం రావాలని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి బిసిలకు మోసం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కలేకర్ కమిషన్, మండల్ కమిషన్‌లను అమలు చేయకుండా ప్రభుత్వాలు అడ్డుపడ్డాయని విమర్శించారు. బిఎస్పి వ్యవస్థాపక అధ్యక్షుడు కాన్షీరామ్ మండల్ కమిషన్‌పై అప్పటి విపి సింగ్ సర్కార్‌పై ఎనలేని పోరాటం చేశారని గుర్తు చేశారు. ఢిల్లీలో 40 రోజుల పాటు ఆయన ధర్నా చేశారని, నిత్యం పెద్ద సంఖ్యలో జైల్‌భరో కార్యక్రమం చేపట్టారని తెలిపారు. ఆయన పోరాట ఫలితమే ఆర్టికల్ 340 ద్వారా మండల్ కమిషన్ అమలు చేశారని గుర్తు చేశారు. ఇప్పుడు బిసిలు 27 శాతం రిజర్వేషన్లను అనుభవిస్తున్నారని తెలిపారు. కేవలం ముగ్గురు ఎంపీలతోనే మూడు ప్రధానమైన డిమాండ్లను సాధించిన ఘనత కాన్షీరామ్‌కే దక్కిందని కొనియాడారు. 79 ఏండ్లలో వందలాది మంది ఎంపిలు ఉన్న రాజకీయ పార్టీలు బిసిలకు న్యాయం చేయలేదని విమర్శించారు. పేదవారికి రాజ్యా ధికారం దక్కే దిశగా బిఎస్పి పోరాడుతుందని, కార్యకర్తలు జనంలోకి వెళ్లి మద్దతు కూడగట్టాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పార్టీ కేంద్ర సమన్వయకర్త సురేష్ ఆర్య, రాష్ట్ర సమన్వయకర్త దాగిళ్ల దయానందరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు బోయిన చంద్రశేఖర్ ముదిరాజ్, ప్రభుకుమార్, జిల్లా అధ్యక్షుడు తలారి నరేందర్, ఉపాధ్యక్షుడు బాల్‌రాజ్, ఇన్చార్జ్ సయ్యద్ ఆమేర్, ప్రవీణ్‌కుమార్, సాయికుమార్ ముదిరాజ్, అంజాద్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రోటోకాల్ పాటించని అధికారులను నిలదీస్తాం

### తప్పు దొర్లితే సహించేది లేదు

### అధికారులపై చర్యలకు బిజెపి డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న బిజెపి నాయకులు

**రంగారెడ్డి, నవంబరు 2, ప్రభాతవార్త :** మంచాల మండల బిజెపి పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు నూకం రాజు ముదిరాజ్ మాట్లాడుతూ ఆరుట్లలో జరిగే బుగ్గ రామలింగేశ్వరస్వామి జాతర వాల్ పోస్టర్‌లో మండలి సభ్యుడు ఎం.ఎల్.సి ఏ.వెంకటనారాయణ రెడ్డి ఫోటో లేకపోవడంను అధికారుల వైఫల్యంగా భావిస్తున్నామని అన్నారు. అధికారులు ప్రోటోకాల్ పాటించకుండా అధికారిక కార్యక్రమాన్ని పార్టీ కార్యక్రమంగా నిర్వహించడంపై అధికారులకు ఫిర్యాదు చేస్తామని అన్నారు. అధికారికంగా జరగాల్సిన ఏ కార్యక్రమాన్నైనా పార్టీలకు అతీతంగా నిర్వహించాలని అన్నారు. మునుముందు ఇలాంటి తప్పులు దొరలకుండా అధికారులు జాగ్రత్త వహించాలని మరోసారి ఇలాంటి తప్పు దొర్లితే సహించేది లేదని అధికారులను అధికార పార్టీ నాయ కులను నిలదీస్తామని హెచ్చరించారు. అధికారం అనేది ఏ పార్టీకి కూడా శాశ్వతం కాదని గుర్తు చేశారు. నిరంకుశ పాలనకు ప్రజలు గత శాసన ఎన్నికల్లో ఎలా బుద్ధి చెప్పారు. ఆ ఫలితాలను చూసి కాంగ్రెస్ ప్రభుత్వం గుణపాఠం నేర్చుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మారగొని శ్రీశైలం, పాండాల జంగయ్య, చివురల పాండు, ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ రెడ్డి, సీనియర్ నాయకులు రాజేందర్ రెడ్డి, ప్రకాష్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

## పౌరాణిక కళాకారుడు రాజయ్య గౌడ్ మృతి

**నందిగామ, నవంబరు 2, ప్రభాతవార్త :** నందిగామ మండలం వెంకమ్మగూడ కాంగ్రెస్ సీనియర్ నేత బుయ్యని వీరేందర్ గౌడ్ తండ్రి రాజయ్య గౌడ్ (72)మృతి చెందారు. పౌరాణిక రంగంలో పల్లె సంస్కృతికి జీవం పోసిన రాజయ్య గౌడ్ మృతి చెందారన్న సమాచారం తెలిసిన మహబూబ్నగర్ ఎమ్మెల్సీ ఎన్ నవీన్ కుమార్ రెడ్డి వెంకమ్మ గూడకు చేరుకొని రాజయ్య భౌతిక కాయంపై పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సంతాపం తెలిపిన వారిలో ఉమ్మడి మండలాల మాజీ జెడ్పిటిసి శ్యాంసుందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ ఎం శివశంకర్ గౌడ్, మాజీ జెడ్పి వైస్ చైర్మన్ ఈట గణేష్, చేగూరు సింగిల్ విండో చైర్మన్ జి అశోక్, ధరూరు సతీష్ పాటిల్, జంగిల్ కుమార్ తదితరులు ఉన్నారు.

## నిషేధిత భూముల వివరాలు ఇవ్వండి

**నందిగామ, నవంబరు 2 ప్రభాతవార్త :** నందిగామ మండల పరిధిలోని చేగూరు గ్రామంలో ఉన్న నిషేధిత భూములకు సంబంధించిన పూర్తి వివరాలు ఇవ్వాలని టిడిపి పోలిట్ బ్యూరో సభ్యుడు, షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు సమాచార హక్కు చట్టం ద్వార నందిగామ తహసీల్దార్ కార్యాలయంలో శనివారం దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. చేగురు గ్రామంలో ఏర్పాటైన కన్హాశాంతి వనంలో నిషేదిత భూములు ఉన్నాయనే అభియోగాలు ఉన్నాయని ఎమ్మార్వోకు ఇచ్చిన దరఖాస్తులో పేర్కొన్నారు. కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీ హయాంలో గ్రామాల్లో పర్యటించినప్పుడు స్మశాన వాటికలు, గైరాన్ భూములు, సీలింగ్, భూధాన్, అసైన్డ్ భూములు ఉండేవని ఆ భూములు ఆక్రమణలకు గురయ్యాయని ప్రజలు ఆరోపిస్తున్నారని విచార వీలువిచ్చారు. అంతేకాకుండా చెరువులు, కుంటలు, వాగులు, అసైన్డ్, భూదాన్, ఇనాం దస్తు గర్ధా భూములు కన్హా శాంతి వనంలో ఉన్నట్లయితే సమాచార హక్కు చట్టం ద్వారా తెలియజేయాలని కోరారు.



బక్కని నర్సింహులు.

## రాయితీపై రుణాలు..

**శంకర్‌పల్లి, నవంబర్ 02, ప్రభాతవార్త :** వినియోగదారులు గోల్డ్ లోన్ ను సద్వినియోగం చేసుకోవాలని హెచ్ డి ఎఫ్ సి బ్యాంక్ మేనేజర్ షకీల్ అన్నారు. శంకర్‌పల్లి శాఖలో వినియోగదారులకు బ్యాంకు బంగారం తాకట్టు సేవలను ప్రారంభించి మాట్లాడారు అతి తక్కువ వడ్డీతో బంగారం పై రుణాలు అందజేయడం జరుగుతుందని ఈ అవకాశాన్ని శంకర్ పల్లితోపాటు పరిసర గ్రామాల ఖాతాదారులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రాకేష్ గౌడ్, సతీష్, నీరజ్, భారత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ విస్తరణకు భూమిపూజ

- వైఖానస ఆగమశాస్త్రసోక్తంగా నిర్మాణం
- రూ.110కోట్లతో ఆలయ అభివృద్ధి
- త్వరలో ప్రారంభం కానున్న అభివృద్ధి పనులు



శ్రీవారి ఆలయ విస్తరణ పనులకు భూమిపూజ చేస్తున్న దృశ్యం

**కొడంగల్, నవంబరు 2, ప్రభాతవార్త :** పేదల పెన్నిధిగా పేరుగాంచి రెండవ తిరుపతిగా వెలుగొందుతున్న కొడంగల్ శ్రీమహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ విస్తరణకు ధర్మకర్తలు ఆదివారం భూమిపూజ చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం వైఖానస ఆగమ శాస్త్ర ముఖ్య సలహాదారులు దివంగత సందర వరధ భట్టాచార్యుల కుమారులు కొడంగల్ శ్రీవారి ఆలయ పునఃనిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. వైఖానస ఆగమ శాషోక్తంగా ఆలయ నిర్మాణానికి తెలంగాణా ప్రభుత్వం ముందుకు వచ్చింది. రూ.110కోట్ల వ్యయంతో అభివృద్ధి చేయనున్నట్లు ఆలయ ధర్మకర్తలు తెలిపారు. తెలంగాణా దేవాదాయశాఖ తిరుమల తిరుపతి దేవస్థానం అధ్వర్యంలో అభివృద్ధి పనులు జరుగుతాయి. 2 ఏళ్ళలోపు ఆలయ విస్తరణ అభివృద్ధి పనులు పూర్తి చేయ డానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు, వాస్తు నిపుణులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఆలయాన్ని అభివృద్ధి చేసిన అనంతరం ఈ ప్రాంతం పర్యాటకంగా, ఆధ్యాత్మికంగా ఉపాధిపరంగా ముందుకు వెళ్తుందని అధికారులు తెలిపారు. ఆలయఅభివృద్ధికి ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ



మాడ వీధుల్లో ఊరేగుతున్న శ్రీవారు

తీసుకున్నారు. ఆలయాన్ని విస్తరించి మౌలిక సదుపాయాలు కల్పిస్తారు. తిరుమల తరహాలో వైఖానస ఆగమ శాస్త్రోకంగా అభివృద్ధి చేస్తారు. క్యూలైన్, కళ్యాణ మంటపం, కళ్యాణకట్ట, పూజా మందిరాలు, వసతిగదులు, స్నానఘట్టాలు, మరుగుదొడ్లు, పార్కింగ్, పుష్కరిణి, ప్రసాదం కౌంటర్లు తదితరవాటికి నూతన భవనాలు నిర్మిస్తారు. శ్రీవారి ఉత్సవాలు, బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉత్సవమూర్తుల ఊరేగింపు కోసం మాడ వీధులను ఏర్పాటు చేస్తారు. దేవాలయ పునరుద్ధరణ పనుల్లో భాగంగా వివిధ పనులకు సంభందించిన నక్షలను సిద్దంచేశారు. కొడంగల్ శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయాన్ని తిరుమల తరహాలో అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం సిద్దంగా ఉంది. 8736 గజాల స్థలం సేకరించి అన్ని వసతులు, సౌకర్యాలతో అభివృద్ధి చేయనున్నారు. ఆలయ విస్తరణలో భాగంగా ఇండ్లు కోల్పోతున్న వారికి ప్రత్యేక ప్యాకేజీతో పరిహారం చెల్లిస్తున్నారు. భూమిపూజ



శంకర్‌పల్లిలో ఆడపడుచులు కుంకుమార్చన కార్యక్రమం

కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు నందారం శ్రీనివాస్, రత్నం, ప్రశాంత్, రాజు, మధు, మాజీ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మేన్ ఉసారాణీ, మాజీ కౌన్సిలర్‌లు మధుసుదన్‌యాదవ్, శంకర్ నాయక్, ఈఓ రాజేందర్‌రెడ్డి, లయన్స్‌క్లబ్ అద్యక్షులు, సామాజిక కార్యకర్త మురారి వశిష్టతో పాటు పట్టణవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**ఆలయంలో ఘనంగా కౌశిక ద్వాదశి వేడుకలు :** కొడంగల్ శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయంలో ఆదివారం ఉదయం కౌశిక ద్వాదశి ఆస్థానం నిర్వహించారు. శ్రీ ఉగ్ర శ్రీనివాసమూర్తి ఉభయ నాంచారులతో కలిసి మాడ వీధుల్లో ఊరేగారు. శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని ఆస్థాన మండపంలో వేంచేసి పురాణ పఠనంతో ఆరాధించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

## భక్తిశ్రద్ధలతో దేవాలయాల ప్రతిష్టా సన్నాహాలు

### వేదమంత్రాలు, భక్తి నృత్యాలతో ఉత్సాహ కార్యకలాపాలు

**శంకర్‌పల్లి, నవంబరు 02, ప్రభాతవార్త :** శంకర్‌పల్లి మండలం పరిధిలోని కొండకల్ గ్రామ గ్రామంలో నూతనంగా శ్రీ మల్లన్న, బీరప్ప, కొండపోచమ్మ దేవాలయాలను గ్రామ కురుమ సమాజం శ్రద్ధగా, భక్తితో ప్రతిష్టాపన చేస్తున్నారు. ఆదివారం దేవతల విగ్రహాలకు వేదపండితుల సాన్నిధ్యంలో ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. వేద మంత్రోచ్ఛారణలతో, మంగళ వాయిద్యాలనాదంతో ఆప్రాంతం ఆధ్యాత్మిక వాతావరణంలో మునిగి



భక్తి నృత్యాలతో ఉత్సాహ కార్యకలాపాలు

పోయింది. ఉదయం ప్రారంభమైన పూజా కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువత, దాతలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సుమారు 200 మంది ఆడపడుచులు కుంకుమార్చన కార్యక్రమంలో పాల్గొని భక్తి శ్రద్ధలతో



ఎదులాబాద్ గోదామన్నార్‌నాయకస్వామి ఆలయంలో సుదర్శనహోమం నిర్వహిస్తున్న భక్తులు

దేవతలను సత్కరించారు.

ఈ కార్యక్రమం సందర్భంగా గ్రామమంతా పండుగ వాతావరణం నెలకొంది. అత్యంత ఆకర్షణగా తిరుపతి విజయోత్సవాల్లో ప్రసిద్ధి చెందిన భక్తి గాయకుడు సతీష్ పంతులు తన ఆధ్యాత్మిక గీతాలతో, నృత్య ప్రదర్శనలతో భక్తులను అలరించారు.

ఆయన భక్తి గానాలు అక్కడి వాతావరణాన్ని మరింత భక్తిరసమయం చేశాయి. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని, సామూహిక భోజనాన్ని నిర్వహించారు. సాయంత్రం చండి యాగం వేదపండితుల ఆధ్వర్యంలో సంప్రదాయంగా జరగగా, వేద మంత్రాలతో వాతావరణం మార్మోగిపోయింది. గ్రామ కురుమ సంఘ పెద్దలు మాటా ్లడుతూ మల్లన్న, బీరప్ప, కొండపోచమ్మ దేవాలయాల నిర్మాణం మన గ్రామ గౌరవం. గ్రామంలోని ప్రతి కుటుంబం ఈ ప్రతిష్ట కార్యక్రమానికి తమ వంతు సహకారం అందిస్తోంది. నేడు జరిగే విగ్రహ పత్తిష్టాపన కార్యక్రమంలో అందరు పాల్గొనాలని తెలిపారు.

## ఎదులాబాద్‌లో ఘనంగా సుదర్శన హవనం

**ఘట్‌కేసర్, నవంబరు 02, ప్రభాతవార్త :** ఘట్‌కేసర్ మున్సిపల్ ఎదులాబాద్‌లోని శ్రీగోదాసమేత రంగమన్నార్‌నాయకస్వామి దేవస్థానంలో ఆదివారం సుదర్శనహవనం ఘనంగా నిర్వహించారు. లోకకళ్యాణార్థం ప్రతినెలా మొదటి ఆదివారం ఆలయంలో ధర్మకర్తలు సుదర్శన హవనం జరుపుతున్నారు.

తిరువడందెం పొరెత్తి వంశపారంపర్య ధర్మకర్తల వేదమంత్రోచ్చారణాల మధ్య ఆలయంలో హైదరాబాద్ నగరం నుంచి విచ్చేసిన పలువురు దంపతులు భక్తితో హోమంలో పాల్గొన్నారు. స్వామి దర్శనానికి భక్తులు భారులు తీరి దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం ధర్మకర్తలు భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నప్రసాద వితరణ చేశారు.

## అంటరానితనం, సామాజిక అణచివేత నిర్మూలనకు అంబేద్కర్ కృషి



అంబేద్కర్‌కు నివాళులు అర్పించి మాట్లాడుతున్న మాజీ వార్డుసభ్యులు శ్రీనివాస్‌గౌడ్

**ఘట్‌కేసర్, నవంబరు 2, ప్రభాతవార్త :** ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, బీసీ, అగ్రవర్ణాలోని పేదలు కలిస్తే బహుజన రాజ్యాధికారం సిద్ధిస్తుందని అవుషాపూర్ మాజీ వార్డుసభ్యులు బొడిగె శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఘట్‌కేసర్ పట్టణంలో ఆదివారం ప్రబుద్ధభారత్ ఇంటర్నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని ప్రజలలోకి తీసుకువెళ్లడానికి 238వ వారం నిత్యపూల మాళ కార్యక్రమం నిర్వహించారు. బీఆర్ఎస్‌పార్టీ మండల కార్యదర్శి బొడిగె శ్రీనివాస్‌గౌడ్ విచ్చేసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాళ వేసి నివాళులు అర్పించారు. పిబిఐ మేడ్చల్ జిల్లా సమన్వయకర్త ఎం.అరుణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ అందించిన స్ఫూర్తితో ప్రతిఒక్కరూ సామాజికస్పృహను కలిగి ఉండి రాజ్యాంగ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. ప్రపంచంలోనే అత్యంత ప్రజాస్వామిక దేశం భారతదేశమని దేశంలో సామాజిక అణచివేత, అంటరానితనం నిర్మూలనకు అంబేద్కర్ ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. అనంతరం రాజ్యాంగ పీఠికపై అందరూ ప్రమాణం చేశారు. నవంబర్ 4న భారత రాజ్యాంగ పరిషత్తులో అంబేద్కర్ రాజ్యాంగ ముసాయిదా రాష్ట్రపతి డాక్టర్ బాబు రాజేంద్రప్రసాద్‌కు సమర్పించి 77 సంవత్సరాలు గడుస్తున్న సందర్భంగా భారత రాజ్యాంగం రూపొందించడానికి అంబేద్కర్ చేసిన కృషిని అరుణ్‌కుమార్ గుర్తు చేశారు. ఈకార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు మేకల దాసు, బండారు రాందాసు, కె.సత్యం, రాజేశ్‌కుమార్, సురేశ్‌గౌడ్, జగదీష్, రాజు, అంజయ్య, శ్రీరామ్, కృష్ణంరాజు, సంతోష్, ఆనంద్, నిఖిల్, విష్ణు, శివకృష్ణ, ముఖేశ్, లలిత్ ప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## దళారులను నమ్మి మోసపోవద్దు

### ..రైతులకు గిట్టుబాటు ధర కల్పించి రారాజులుగా చేయడమే లక్ష్యం

### .....కోటపల్లి మార్కెట్ కమిటి చైర్మన్ జి.అంజయ్య



పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మెన్

**పెద్దేముల్, నవంబరు 2, ప్రభాతవార్త:** దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని, రైతు సంక్షేమం కోసం అహర్నిశలు కృషిచేస్తున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్‌ప్రభుత్వమని కోటపల్లి మార్కెట్ కమిటి చైర్మెన్ జి.అంజయ్య అన్నారు. ఆదివారం పెద్దేముల్ మండలం మారెపల్లిలో సీసీఐ అధ్వర్యంలో సుమిత్ర, మంగళం జిన్నింగ్ మిల్లులలో ఎఎంసి వైస్ చైర్మెన్ ఎస్.నారాయన్‌రెడ్డితో కలిసి పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించి వారిని రారాజులుగా చేయడమే సిఎం రేవంత్ సర్కార్ లక్ష్యమని అన్నారు. దళారుల దోపిడిని అరికట్టేందుకు ప్రభుత్వం పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. గత ఏడాది రైతుల కంటే ఎక్కువ దళారులే పత్తి విక్రయాలు చేసారని అన్నారు. కాని ఈ సారిఅలాంటి పొరపాట్లు జరగకుండా కపాస్ కిసాన్ యాప్‌ను ప్రభుత్వం తీసుకొచ్చిందని అన్నారు. సబ్బండ వర్గాల సంక్షేమమే ప్రజాప్రభుత్వ ముఖ్య ఉద్దేశమనిఅన్నారు. ప్రభుత్వం సీసీఐ ద్వారా ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాలలోనే రైతులు పత్తిని విక్రయించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కోటపల్లి మార్కెట్ కమిటి ఇంచార్జ్ కార్యదర్శి ఫసియుద్దిన్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొమ్ము గోపాల్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యాక్షులు ఎల్లారెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పెండ్యాల ప్రవీన్ కుమార్ గుప్తా, యువనాయకులు రుద్రారం మహిపాల్‌రెడ్డి, ఎస్.శ్రీనివాస్‌రెడ్డి, సొసైటి డైరెక్టర్ ఉప్పరి మల్లేశం, మార్కెట్ కమిటి డైరెక్టర్లు హరిసూధన్‌రెడ్డి, ఎక్బాల్, అక్బర్, నాయకులు కోటపల్లి బందెన్న, చిత్రశేఖర్, విఠల్‌గౌడ్, డివై నర్సిములు, మైపూస్, చిట్టెపు రాఘవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆరు గ్యారంటీలు పక్కాగా అమలు చేస్తున్నాం

శామీర్‌పేట, నవంబరు 2, ప్రభాతవార్త జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహనిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో శామీర్‌పేట ఉమ్మడి మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొని ప్రచారం చేశారు. ఆదివారం శామీర్‌పేట ఉమ్మడి మండలం నుంచి నగరంలోని జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో పాల్గొనటానికి శామీర్‌పేట మండలం అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు తుంకి రమేశ్, జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి, మేడ్చల్ ఎఎంసి చైర్మన్ బి.నర్సింలుయాదవ్‌లు, రాష్ట్ర హాజ్‌కమిటీ మెంబర్ ఎండి ముజీబుద్దీన్ పలువురు నాయకులు పాల్గొని కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌ను గెలిపించాలని ప్రచారం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు చెప్పిన విధంగా ఆరు గ్యారంటీ పథకాలు పక్కాగ అమలు చేస్తుందని కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని ప్రచారం చేస్తూ వారు కోరారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి రహమత్‌నగర్ డివిజన్‌లో కాంగ్రెస్ నాయకులు ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు కాంగ్రెస్ నాయకులు ఊరడి వెంకటేశ, భూమిరెడ్డి, నవీన్‌రెడ్డి, తుంకి లక్ష్మయ్య, కొమ్ము వినోద్, మునిగొండ నవీన్, పిట్ల నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.



రెవెన్యూ మంత్రి పొంగులేటితో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు తుంకి రమేశ్, జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి, పలువురు నాయకుల దృశ్యం



నిరసన దీక్షలో మాట్లాడుతున్న కెడిపి, జెఎసి నాయకులు

## విద్యా సంస్థల తరలింపును వెనక్కి తీసుకోవాలి

### కెడిపి,జేఏసీ అధ్వర్యంలో కొనసాగుతున్న నిరసన దీక్షలు

**కొడంగల్, నవంబరు 2, ప్రభాతవార్త :** విద్యా సంస్థల తరలింపు ఆలోచనను ప్రభుత్వం వెనక్కి తీసుకునే వరకు నిరసన దీక్షలు కొనసాగిస్తామని కెడిపి, జేఏసీ కోకన్వీనర్‌లు ఒంటి సురేష్‌కుమార్, ఎర్రన్‌పల్లి శ్రీనివాస్, భీంరాజ్‌లు అన్నారు. కెడిపి, జేఏసీ అధ్వర్యంలో కొడంగల్ అంబేద్కర్ చౌరస్తాలో చేపట్టిన నిరసన దీక్ష ఆదివారం రెండవ రోజు సజావుగా సాగింది. ఆటాపాటలతో నిరసన దీక్షను కొనసాగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెడికల్ కళాశాల, సమీకృత గురుకుల పాఠశాలల భవన నిర్మాణాలతో పాటు అదనపు ప్రభుత్వ కార్యాలయాలు కొడంగల్‌లోనే నిర్మించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. మెడికల్ కళాశాల, సమీకృత గురుకుల పాఠశాల భవన నిర్మాణాలకు కొడంగల్‌లో శంకుస్థాపన చేసి, పనులు ప్రారంభించిన రాష్ట్ర ప్రభుత్వం లగచర్ల, హకీంపేటలకు తరలించడం వెనుక దాగిఉన్న అంతర్యమేంటని స్పష్టం చేయాలని వారు డిమాండ్ చేశారు. కొడంగల్‌లో అభివృద్ధి పనులు చేపట్టకపోతే భవిష్యత్తులో కొడంగల్ మరింత వెనుకబాటుకు గురవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏళ్ళ తరబడి వెనక్కి నెట్టివేయబడిన కొడంగల్‌ను అభివృద్ధి పథంలో నడిపిస్తానని అనేక మార్లు వాగ్దానం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తుతం కొడంగల్‌ను పట్టించుకోకపోవడానికి గల కాణమేంటో ఆర్థం కావడం లేదన్నారు. శంకుస్థాపనలు చేసిన చోటనే మెడికల్ కళాశాల, సమీకృత గురుకులాల భవన నిర్మాణాలు కొనసాగించేదాకా కెడిపి, జేఏసీ పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు. నిరసన దీక్షకు మద్దతుగా సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు పీర్ మహామ్మద్, సిఐటీయూ జిల్లా ఉపాద్యక్షులు బుస్స చంద్రయ్య మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో యు.రమేష్‌బాబు. మాసాని వెంకటయ్య, ప్రవీణ్, జానపద కళాకారులు బాలు, సాయిలు, రాజు తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ వినియోగదారుల దినోత్సవం

### ..ఫిర్యాదుల స్వీకరణ..శామీర్‌పేట ఏడిఈ అశోక్‌రావు

**శామీర్‌పేట, నవంబరు 2, ప్రభాతవార్త :** విద్యుత్ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శామీర్‌పేట విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయ ప్రాంగణంలో సోమవారం ఉదయం 10గంటలకు విద్యుత్ వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు వినియోగదారులు తమ సమస్యలను ఫిర్యాదు రూపంలో తెలియజేయవచ్చని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని శామీర్‌పేట్ విద్యుత్ సబ్ డివిజన్ ఏడిఈ అశోక్‌రావు కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలు ఉంటే ఫిర్యాదు రూపంలో తెలియజేయాలని అన్నారు. విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ఎల్లపుడు విద్యుత్ అధికారులు, సిబ్బంది కట్టుబడి ఉంటారని, మెరుగైన, సమర్థవంతమైన సేవలు అందించే దిశగా నిరంతరం కృషి చేస్తామని అన్నారు. విద్యుత్ వినియోగదారులు ఇట్టి సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ సమస్యలు ఉన్న వారు శామీర్‌పేట విద్యుత్ సబ్‌డివిజన్ ఆఫీస్‌కు వచ్చి పరిష్కరించుకోవాలని ఏడిఈ అశోక్‌రావు సూచించారు. అయితే సోమవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా ఈ సమావేశం ఉంటుందని వినియోగదారులు పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

## అక్రమంగా నిల్వచేసిన బాణాసంచా స్వాధీనం

**ఘట్‌కేసర్, నవంబరు 2, ప్రభాతవార్త:** అక్రమంగా నిల్వచేసిన బాణాసంచాను స్వాధీనం చేసుకొని ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఘట్‌కేసర్ ఎస్ఐ శేఖర్ తెలిపారు. ఘట్‌కేసర్ మున్సిపల్ ఎన్ఎఫ్‌సీనగర్‌లోని బి2-5 గల ఇంట్లో అక్రమంగా టపాసులు నిల్వచేస్తున్నారన్న సమాచారంతో ఘట్‌కేసర్ పోలీసులు వెళ్లి ఇంట్లో తనిఖీలు జరిపారు.

ఇంటి యాజమాని ఎడవెల్లి రమేష్ (39)ను విచారించి అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. 2 బూస్టర్ (5000వాలా), 1 ఫుషన్‌షాట్స్(240షాట్స్), 1 జెన్ 60 బుల్లెట్స్, 4 తాజ్‌మహాల్ 1కె వాలా, 2 క్రాకింగ్ ఆడియో బాక్సెస్, 12 షాట్స్, 40 ఆపిల్ 2, రెయిన్‌బో షాట్స్ 2, మల్టిపుల్ క్రాకర్స్ తదితర బాణాసంచాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మరో కేసులో ఘట్‌కేసర్ బాలాజీనగర్‌లో ఓఇంటి ముందు అశోక్ లేలాండ్ వాహనంలో 35 కార్టూన్స్ టపాసులు నిలువ చేసిన నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మొగుళ్ల అనిల్ (38) చింతల రాజేశ్ (29), సారంగా ఆకాష్ (32), తూర్పునూరి శ్రావణ్‌గౌడ్ (32)లను అదుపులోకి తీసుకొని అక్రమంగా నిల్వఉంచిన బాణాసంచాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శేఖర్ తెలిపారు. ఎవరైనా పేలుడు పదార్థాలను అక్రమంగా నిల్వ చేస్తే వారిపై కేసు నమోదు చేస్తామని పేలుడు పదార్థాలు నివాసయోగమైన ప్రాంతాల్లో నిల్వ ఉంచరాదని ఆయన స్పష్టం చేశారు.

## ఆమె వేధింపులు ఇక భరించలేం

### (మొదటి పేజీ తరువాయి)

పేద విద్యార్థినుల కోసం ఉచిత భోజన సౌకర్యం ఏర్పాటు చేస్తుంటే .. మెస్ సరుకుల్లో చాలా వరకూ ఆమె మూటకట్టి బయటకి తరలిస్తోందని వివరించారు. దీనికి సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయన్నారు. ముఖ్యంగా ఫీజుల విషయంలో అక్రమంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. వివాహం అయిన విద్యార్థినులు ఎవరైనా ఉంటే వారు కట్నం ఎంత ఇచ్చారో అందులో సగం తనకు ఇవ్వాలని టార్చర్ పెడుతున్నారని చెప్పారు. ప్రిన్సిపల్ శైలజ అక్రమాలకు కళాశాలలో కొంతమంది లెక్చరర్లు సహకరిస్తున్నారని పేర్కొన్నారు.

అవినీతి ముడుపులను వేరొక అధ్యాపకుని ద్వారా వసూలు చేయిస్తోందన్నారు. విద్యార్థినులను డబ్బుల కోసం బాగా ఇబ్బంది పెడుతోందని పేర్కొన్నారు. వెంటనే ప్రిన్సిపల్‌ను సస్పెండ్ చేయాలని, లేదా ఇక్కడ నుండి తొలగించాలని విద్యార్థినులు డిమాండ్ చేశారు. ఉదయం నుండి ఆందోళన బాట పట్టిన విద్యార్థినులు అన్నపానీయాలు ముట్టుకోకుండా న్యాయం కోసం కళాశాల ముందు భీష్మించుకుని కూర్చున్నారు. ధర్నా సందర్భంగా మహిళా కానిస్టేబుల్ జ్యోత్స్న ఓ విద్యార్థినిపై చేయి చేసుకోవడంతో ఉద్రిక్త పరిస్థితి చోటుచేసుకుంది. ఆగ్రహించిన మిగతా విద్యార్థినులు మూకుమ్మడిగా మహిళా కానిస్టేబుల్‌ను జుట్టు పట్టి ఈడ్చుకొని వచ్చి చితకబాదారు.

## మద్యానికి బానిసై ఉరి వేసుకుని ఆత్మహత్య

### (మొదటి పేజీ తరువాయి)

మార్గ మద్యంలో అక్కడక్కడ కారు ఆపి మద్యం సేవించి వచ్చాడు సాయంత్రం ఆరు గంటల సమయంలో తన స్నేహితుని ఇంటికెళ్లి రాత్రికి అక్కడి ఉన్నామనీ మరసటి రోజు ఉదయం కొత్లా పూర్ గ్రామానికి చేసుకున్నామనీ అదే రోజు సాంత్రం బయటకు వెళ్ళి వస్తామ ఇంటికి తిరిగి రాలేదు ఎప్పుడు ఇలానే వెళ్ళి రెండు, మూడు రోజుల తర్వాత తిరిగి వచ్చేవాడనీ అలానే వస్తాడనీ ఊరుకున్నట్లు మమత పేర్కోంది.

నవంబర్ 2న తన బావ తిరుతిరెడ్డి పొలానికి వెళ్ళగా రేకుల షెడ్డులో నుండి దుర్గందం వాసన రావడంతో వెళ్ళి చూడగా మోహన్‌రెడ్డి ఉరి వేసుకుని మరణించి నట్లు మమత తెలిపింది ఆమె ఫిర్యాదు మెరకు మర్పల్లి యస్.ఐ రహూఫ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# టెలిఫోన్‌కాలనీ అభివృద్ధికి ఎంతోగానో కృషి చేశాం

### -సమావేశంలో సంజీవరెడ్డి, బుచ్చిరెడ్డి



బోడుప్పల్ టెలిపోన్‌కాలనీ సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అధ్యక్షులు మంద సంజీవరెడ్డి, పాల్గొన్న మాజీ మేయర్ బుచ్చిరెడ్డి తదితరులు

**బోడుప్పల్, నవంబర్ 2, ప్రభాతవార్త:** బీఆర్ఎస్ ప్రభుత్వ హాయాంలో టెలిపోన్‌కాలనీ అభివృద్దికి కృషి చేసినట్లు బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ సామల బుచ్చిరెడ్డి, బీఆర్ఎస్‌పార్టీ అధ్యక్షులు మంద సంజీవరెడ్డి అన్నారు. బోడుప్పల్‌లో ఆదివారం నిర్వహించిన టెలిపోన్ కాలనీ సంక్షేమ సంఘం సమావేశంలో వారఉ ముఖ్యఅతిధులుగా పాల్గొని మాట్లాడారు. కోట్లాది రుపాయల వ్యయంతో టెలిపోన్ కాలనీలో రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, త్రాగునీరు సౌకర్యాలు కల్పించామని తెలిపారు.

ప్రస్తుత కొంతమంది కాలనీవాసులు కాలనీ విడగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని, టెలిపోన్‌కాలనీ రోడ్‌నెంబర్ 4 వీధి సూచిక బోర్డులను చెరిపి వేస్తున్నారని ఆరోపించారు. అధికారికంగా ఎన్నికైన కాలనీ కమిటీ ఉండగా ఇలా చేయడం ఎంతవరకు సమంజసమని అని ఆయన ప్రశ్నించారు.

ఈకార్యక్రమంలో 15వ డివిజన్ ఇంచార్జ్ సిగురు రేణుక రవికుమార్ ముదిరాజ్, కాలనీ అద్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేశ్‌గౌడ్, దానయ్య, గాజుల శ్రీనివాస్‌గౌడ్, రమేశ్‌గౌడ్, ధర్మారెడ్డి, శేఖర్‌గౌడ్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్యారంగాన్ని ఉపాధ్యాయులు పరిరక్షించుకోవాలి

### రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

**ఆమనగల్లు,నవంబరు 2, ప్రభాతవార్త:** మారుతున్న సమాజ పోకడల కనుగుణంగా విద్యా రంగం లో సంస్కరణలు చేపట్టి ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి విద్యా విధానాలలో మార్పులు తీసుకురావాల్సి న అవసరం ఎంతైనా ఉందని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచి విద్యా రంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయుల గురుతర బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. గిరి కొత్తపల్లి గ్రామానికి చెందిన కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత , నమస్తే ఉపాధ్యాయ పత్రిక సహసంపాదకులు ఇట్టే కృష్ణారెడ్డి పదవి విరమణ సన్మాన కార్యక్రమాన్ని ఆదివారం హైదరాబాదులోని ఓ ఫంక్షన్ హాల్లో ఘనంగా నిర్వహించారు. ఎస్ టి యు టి ఎస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి గుత్తా సుఖేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ దయానంద్ ,మాజీ ఎమ్మెల్యే కత్తి నరసింహ రెడ్డి , ఎస్ టి యు రాష్ట్ర అధ్యక్షుడు భీమనాథుని రవి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందం గౌడు, మాజీ అధ్యక్షుడు పర్వత్ రెడ్డి లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎస్ టి యు జిల్లా అధ్యక్షుడు బి వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఏటేటా విద్యార్థుల సంఖ్య పడిపోతూ ప్రభుత్వ పాఠశాలలు మనుగడ ప్రమాదకరంగా మారుతుందని విచారణ వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలపై విద్యార్థుల సంఖ్యను పెంచి ప్రభుత్వ పాఠశాలలను కాపాడు కోవడానికి ఉపాధ్యాయులు బాధ్యత స్వీకరించాలని కోరారు. రాష్ట్రంలో ప్రవేట్ పాఠశాలల్లో 36 లక్షల మంది విద్యార్థులు ఉండగా, ప్రభుత్వ పాఠశాలలో మాత్రం18 లక్షలకు పడిపోయిందనీ పేర్కొన్నారు. ఉపాధ్యాయులకు విద్యార్థులకు మధ్య అనుబంధం పెరగాలనీ , వృత్తిని ఉపాధ్యాయులు అంకితభావం తో నిర్వర్తించాలని కోరారు. సమాజంలో ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైనదనీ వృత్తి విలువలను పరిరక్షి ంచుకోవాల్సి న అవసరం ఎంతైనా ఉందని సుఖేందర్ రెడ్డి అన్నారు.పదవి విరమణ పొందుతున్న ఉపాధ్యాయులు సమాజసేవకు పునరంకితం కావాలనీ కోరారు.ఉపాధ్యాయులు హక్కుల తో పాటు బాధ్యతలు గుర్తిరిగి మసులుకోవాలనీ చెప్పారు. నిస్వార్థ సేవలకు సమాజంలో చిరస్థాయి గుర్తింపు ఉంటుందనీ సుఖేందర్ రెడ్డి పేర్కొన్నారు. మానవతా విలువల పెంపుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. ఉపాధ్యాయ వృత్తికి కృష్ణారెడ్డి అందించిన సేవలను కొనియాడారు. ఎమ్మెల్సీ దయానంద్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల న్యాయమైన సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. విద్యారంగ బలోపేతానికి మరిన్ని సంస్కరణలు తీసుకురావాల్సి న అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత లిక్కి అను రుద్రా రెడ్డి, ఎంఈఓ రామారావు, హెచ్ఎం నరసింహ, శంకర్, శృతిలయ కల్చర్ అకాడమీ చైర్మన్ దార్ల చిత్తరంజన్ దాస్, ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు సుధాకర్ రెడ్డి, ప్రేమ్ కుమార్ రాధా జయలక్ష్మి శిరీష విశ్వశాంతి ,నీరజ, పాండురంగారెడ్డి, రాంరెడ్డి, నాయకులు గొంది జైపాల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి , రాజేందర్ రెడ్డి, సెక్రెటరీ పోల్ రెడ్డి , ఫణి కుమార్ రెడ్డి,మానస, సాయి కిరణ్ రెడ్డి, శిరీష, కవిత, సునిత , రాములమ్మ, యాదవ రెడ్డి,వనజాత, ప్రమోదిత,సబితా,వికాస్,రాజవర్ధన్ రెడ్డి, సాయి కిషోర్, అభినవ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.






గురుకుల్‌లో విరాళం అందజేస్తున్న మాజీ సర్పంచ్ సంజీవగౌడ్

## మరుగుదొడ్ల నిర్మాణానికి విరాళం అందజేత

### -గురుకుల్ పూర్వవిద్యార్థుల సహకారం

**ఘట్‌కేసర్, నవంబరు 2, ప్రభాతవార్త:** గురుకుల్ విద్యాసంస్థలో మాజీ ప్రజాప్రతినిధులు, పూర్వవిద్యార్థులు చేపట్టిన మరుగుదొడ్ల నిర్మాణ పనులకు నాయకులు విరివిగా విరాళం అందజేస్తున్నారు. విద్యార్థులకు మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతుండగా గురుకుల్ పరిరక్షణ సమితి సభ్యులు అధ్యాపకులు, ఉపాధ్యాయులతో చర్చించి శ్లాబ్ వేసి ఉన్న నిర్మాణంలో మరుగుదొడ్లు నిర్మిస్తున్నారు. దాతలు, నాయకులు, పూర్వవిద్యార్థులు ముందుకు వచ్చి తమ వంతుగా విరాళాలు, నిర్మాణ సామాగ్రిని అందిస్తున్నారు. ఆదివారం ఘణాపూర్ మాజీ సర్పంచ్ వేముల సంజీవగౌడ్ (1969 బ్యాచ్ పూర్వవిద్యార్థి) తన వంతుగా రూ.5,000లు మరుగుదొడ్ల నిర్మాణానికి అందజేశారు. గురుకుల్ పరిరక్షణ సమితి కన్వీనర్ అంకం సురేశ్‌కుమార్, మాజీ ఎంపిపి బండారి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపిటిసి దీకొండ రఘు, న్యాయవాది కొమ్మిడి రాఘవరెడ్డి, జిపిఎస్ సభ్యులు బచ్చు నగేశ్‌కుమార్‌గుప్తా, కందకట్ల మాధవరెడ్డి, చుక్కల రవిశంకర్, ఎం.ఎ.ఖలీల్‌అక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

## సదర్ యాదవ సాంప్రదాయ ఉత్సవం



సదర్ ఉత్సవంలో పాల్గొన్న మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పావని జంగయ్యయాదవ్

**ఘట్‌కేసర్, నవంబరు 2, ప్రభాతవార్త:** దీపావళి సందర్భంగా జరుపుకునే సదర్ ఉత్సవం యాదవుల సాంప్రదాయ వేడుక అని ఘట్‌కేసర్ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్ అన్నారు. మున్సిపల్ పరిధిలోని ఎదులాబాద్‌లో యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సదర్ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా శ్రీకృష్ణభగవాన్‌కు ప్రత్యేక పూజలు చేసి సదర్ ఉత్సవాన్ని ప్రారంభించారు. యాదవ నాయకులు దున్నపోతును అలంకరించి విన్యాసాలు చేయించారు. కళాకారులు నిర్వహించిన సాంస్కృతిక, సంగీత విభావరి అందరిని ఆకట్టుకుంది. విచ్చేసిన నాయకులను యాదవ సంఘం నాయకులు శాలువాతో సన్మానించారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపిటిసి కందుల కుమార్, సొసైటీ మాజీ సభ్యులు గాయరు విశ్వనాథం, మాజీ వార్డుసభ్యులు బింగి యుగంధర్‌గౌడ్, బొక్క సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బోడుప్పల్ చెంగిచర్లలో గొరిగె నరసింహ ఆధ్వర్యంలో కల్వకుంట్ల కవితకు గొర్రె పిల్లను బహుకరిస్తున్న జాగృతి సభ్యులు

## తెలంగాణ జాగృతిలో భారీగా చేరికలు

### -కండువాలతో ఆహ్వానించిన కవిత

**బోడుప్పల్, నవంబరు 2, ప్రభాతవార్త:** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కురుమ సంఘం అధ్యక్షులు గొరెకె నరసింహ ఆధ్వర్యంలో యూత్ సంఘం సభ్యులు 200 మంది తెలంగాణ జాగృతిలో చేరారు. ముఖ్యఅతిధిగా జాగృతి అధ్యక్షురాలు-ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విచ్చేసి సభ్యులకు కండువాలు కప్పి జాగృతిలోకి ఆహ్వానించారు. హైదరాబాద్‌లో అనేక సమస్యలు ఉన్నాయని తెలంగాణలో ఉన్నా అన్ని సమస్యపైన జాగృతి తరపున పోరాటం చేస్తామని కవిత తెలిపారు. చెంగిచర్ల మేకల మండి ఓపెన్ టెండర్ ద్వారా నిర్వహించాలని దాని ద్వారా ఆవృత్తిలో గొల్ల కురుమలకు టెండర్ వచ్చే అవకాశం ఉంటుందన్నారు. తెలంగాణ వచ్చి 12 సంవత్సరాలు గడుస్తున్నా బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో మూడు, నాలుగు రోజులకు ఒకసారి మంచినీళ్ల వస్తున్నాయని స్థానికులు చెబుతున్నారని పేర్కొన్నారు. మంచినీళ్ల కోసం కొరత ఉండటం దారుణమని వీటిపై కార్యచరణ చేసి తెలంగాణ జాగృతి తరపున పోరాటం చేస్తామని ఈసందర్భంగా తెలిపారు. ఈకార్యక్రమంలో గొరెకె నరసింహ, గోపు సదానంద్, ఈగ సంతోష్ పాల్గొన్నారు. బాపురాజు, శివకుమార్, తిరుపతి, రాజు, వెంకటేశ్, సతీష్, సత్యానారాయణ,యాకూబ్‌బాషా, దేవేందర్‌రెడ్డి, జంగలి శ్రీనివాస్, కమలాకర్, జల్లి సిద్దులు, గుంటి శ్రీను, గుజ్జ భాస్కర్, మౌనిక, వరలక్ష్మి, మాధవ, శారద తదితరులు తెలంగాణ జాగృతిలో చేరారు.

# గురుకులంలో కలకలంపై సుదీర్ఘ విచారణ

**రంగంలోకి దిగిన సంక్షేమశాఖ జోనల్ చైర్మన్**

**ప్రిన్సిపల్ వేధింపులపై అధికారుల సుదీర్ఘ విచారణ**

**ప్రతేక బృందంతో నిజానిజాలు నిగ్గుతేల్చి చర్యలు తీసుకుంటామని హామీ**

**షాద్‌నగర్, నవంబరు 2, ప్రభాతవార్త :** షాద్‌నగర్ పట్టణంలోని సాంఘిక సంక్షేమ శాఖ నాగర్ కర్నూల్ గురుకుల మహిళా కళాశాల విద్యార్థుల పట్ల ప్రిన్సిపల్ శైలజ అవలంబిస్తున్న తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఆదివారం కళాశాల విద్యార్థినిలు పెద్ద ఎత్తున షాద్ నగర్ చౌరస్తా, 44 నెంబర్ జాతీయ రహదారిపై గంటల పాటు ఆందోళనలు నిర్వహించారు. ప్రిన్సిపల్ శైలజ వ్యవహార తీరును తప్పుపడుతూ వారు న్యాయం కోసం రోడ్డు ఎక్కారు. ఈ నేపథ్యంలో సాంఘిక సంక్షేమ శాఖ జోనల్ చైర్మన్ నిర్మల, స్థానిక ఏసిపి లక్ష్మీ నారాయణ పట్టణ సిఐ విజయ్ కుమార్ తదితరుల సహకారంతో విద్యార్థులను ఆందోళన శాంతింపజేసి వారి సమస్యలను వేరువేరుగా అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో కళాశాల భవనానికి చేరుకున్న సాంఘిక సంక్షేమ శాఖ అధికారులతో పాటు ఏసిపి లక్ష్మీ నారాయణ సిఐ విజయకుమార్ తదితరులు విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గురుకులంలో ప్రిన్సిపల్ శైలజ తమను వేధిస్తున్నారని.. ఆమెపై చర్యలు తీసుకోవాలని విద్యార్థులు సంక్షేమ శాఖ అధికారులతో పాటు స్థానిక పోలీసులకు దృష్టికి తీసుకోవచ్చారు. విద్యార్థుల దగ్గర ఫీజులు అనైతికంగా వసూలు చేయడం, వంట సరుకులు దొంగతనంగా బయటకి తరలించడం,



విచారణలో పాల్గొన్న సాంఘిక సంక్షేమ శాఖ జోనల్ చైర్మన్ నిర్మల, ఏసీపీ లక్ష్మీనారాయణ

భోజనాలకు సంబంధించి తమకు ఇబ్బందులకు గురి చేయడం అనేక అక్రమాలతో పాటు బెదిరింపులు వసూళ్లకు పాల్పడుతున్న ప్రిన్సిపల్ శైలజపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనికి సంబంధించిన అనేక ఆధారాలు కూడా తమ వద్ద ఉన్నట్లు ఈ విచారణలో పేర్కొన్నారు. పోలీసులతోపాటు సాంఘిక సంక్షేమ అధికారులు కూడా విద్యార్థులను వేర్వేరుగా అనేక విషయాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో పాటు రెసిడెన్షియల్ సిబ్బందితో ఏసిపి లక్ష్మీ నారాయణ, సిఐ విజయ్ కుమార్ సైతం మాట్లాడి వాస్తవాలను విచారించారు. విద్యార్థులు రోడ్లపైకి



విద్యార్థులతో మాట్లాడుతున్న విచారణలో పాల్గొన్న సాంఘిక సంక్షేమ శాఖ జోనల్ చైర్మన్ నిర్మల

రావడం మంచి పరిణామం కాదని ఏవైనా సమస్యలు ఉంటే ఉన్న తాధికారులు వెంటనే శాఖ పరంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆందోళనలతో శాంతిభద్రతలకు భంగం కల్పిస్తే ఎలా అని సాంఘిక సంక్షేమ శాఖ సిబ్బందిని మందలించా రు. విద్యార్థుల సమస్యల పట్ల ఉన్నతాధికారులుసాను కూలం గా స్పందించాలని సూచించారు. ఉదయం నుండి విద్యార్థులు ఎలాంటి అన్నపానీయాలు ముట్టుకోకుండా న్యాయం కోసం కళాశాల ముందు భీష్మించుకుని కూర్చున్నారు. పోలీస్ స్టేషన్ నుండి ప్రత్యేక వాహనాల్లో కళాశాలకు తరలించినా విద్యార్థులు ఆ తర్వాత కళాశాల లోపలికి వెళ్లకుండా బయట బైఠాయించారు. ఈ సంఘటనపై విచారణ కమిటీ నియమించి ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని విద్యార్థులు శాంతించాలని.. యధావిధిగా చదువులు

## వేపచెట్టు నరికివేత

### ..డిఎఫ్ఓకు ఫిర్యాదు

**ఘట్‌కేసర్, నవంబరు 2, ప్రభాతవార్త :** ఘట్‌కేసర్ మున్సిపల్ బాలాజీనగర్ లో వేపచెట్టును నరికివేయ డంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కరీంగూడలో ఇంటినెంబర్ 3-123 ముందు పెద్ద వేప చెట్టు ఉండగా అనుమతి లేకుండా నరికి వేసి మొద్దులు, కట్టెలు కార్ఖానాకు తరలించే ప్రయత్నం చేశారు. దీంతో ఇంటి యాజమాని మొగుళ్ల అనిల్‌గౌడ్ మేడ్చల్ జిల్లా అటవీ అధికారి, ఘట్‌కేసర్ మున్సిపల్ కమిషనర్లకు ఫిర్యాదు చేశారు. గత 30 సంవత్సరాలుగా ఉన్న పెద్ద వేప చెట్లు గాలి, నీడ, ఆక్సిజన్ ఇస్తుందని కొందరు కుట్ర చేసి అనుమతి లేకుండా నరికివేశారని తెలిపారు. ఒక ప్రభుత్వం ప్రభుత్వం చెట్లను పెంచాలని చెబుతుండగా అందుకు విరుద్ధంగా ఇక్కడ మహావృక్షాలను నరికివేసి పర్యావరణానికి హానీ కల్గిస్తున్నారని పేర్కొన్నారు. డిఎఫ్ఓ చేరుకొని విచారణ జరిపి చెట్టును నరికిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.



బాలాజీనగర్‌లో వేపచెట్టు నరికివేసిన దృశ్యం

## కోర్టు ఆదేశించినా .. చలనం లేదా!

### (మొదటి పేజీ తరువాయి)

లేదా వ్యక్తులు వీధి కుక్కలను తీసుకెళ్ళకుండా అడ్డుకుంటే తదుపరి చర్యలను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరికలు జారీ చేసిన విషయం తెలిసిందే... అయిన అధికారులు మాత్రం ఏలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలు తీవ్రంగా మండిపడుతున్నారు. భారత జంతువుల సంరక్షణ బోర్డు నియంత్రణకు నిబంధనలు విధించింది. ఈ నిబంధనల కారణంగా వీధి కుక్కలను చంపకపోవడంతో వీధి కుక్కలు మండల వ్యాప్తంగా నాలుగు వేలు పైగా ఉన్నట్లు అంచనా. గ్రామాల్లో నడుచుకుంటూ వెళ్తున్న ప్రజలపై వాహనదారులపై చిన్న పిల్లలపై ఎగబడి తీవ్రంగా కరుస్తూ దాడి చేస్తున్న సంఘటనలు ఎన్నో ఉన్నాయి. కుక్కకాటుకు గురైన బాధితులు చికిత్స కోసం నిత్యం ఆసుపత్రికి వెళ్తున్నట్లు బాధితులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఈ వీధి కుక్కలు ప్రధాన కూడలి వద్ద, చికెన్, మంటన్ సెంటర్ల వద్ద గుంపులు గుంపులుగా ఉంటున్నాయి. ఈ చికెన్, మంటన్ సెంటర్ల వద్ద వ్యర్థ పదార్థాలు అక్కడ పడివేయడం వల్ల కుక్కలు వ్యర్థ పదార్థాలకు అలవాటు పడి స్వైరవిహారం చేస్తున్నాయని గ్రామస్థులు, ప్రజలు ఆరోపిస్తున్నారు. దీని వల్ల ప్రజలు, ముఖ్యంగా చిన్న పిల్లలు స్కూల్ వెళ్ళలంటే ఇబ్బందులు గురి అవుతున్నారని తల్లిదండ్రులు అవేదన వ్యక్తం చేశారు. వీధి కుక్కల బారిన పడకుండా వాటి నుంచి ప్రజలకు రక్షణ కల్పించేందుకు అధికారులు చొరవ తీసుకొని వీధి కుక్కలు ప్రజలపై దాడులు చేయకుండా చర్యలు తీసుకొని వాటిని వేరే చోటికి తరలించాలని ప్రజలు కోరుతున్నారు,

**కుక్కకాటుతో రేబిస్ వ్యాధి వచ్చే ప్రమాదం ఉంది....**

కుక్కకాటు వల్ల రేబిస్‌వ్యాధి సంక్రమించవచ్చు కొన్ని సందర్భల్లో వాటి లాలాజలం ద్వారా కుడా ఈ వ్యాధి వస్తోంది. ఈ వ్యాధి లక్షణాలు ఒకటి నుంచి మూడు నెలల వరకు కనిపిస్తాయి. జ్వరం, తలనొప్పి వంటి లక్షణాలు కన్పిస్తాయి. వ్యాధి తీవ్రత పెరుగుతున్నా కొద్ది మనిషి ప్రవర్తనలో విపరీతమైన మార్పులు కన్పిస్తాయి. సకాలంలో డాక్టర్‌ను సంప్రదించడం ద్వారా టీకాల ద్వారా రేబిస్ వ్యాధి నుంచి బయటపడవచ్చు.

**కుక్కల బారి నుంచి కాపాడాలి**

**ప్రభాకర్‌రెడ్డి, మోత్కుపల్లి,**



మా గ్రామంలోని కాకుండా మండల వ్యాప్తంగా వీధి కుక్కలు విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. స్వైరవిహారం చేస్తూ ఇవి ప్రజలను కరుస్తూ దాడులు చేయడం వల్ల కుక్క కాటుకు గురై ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు ముఖ్యంగా కుక్కలను నియంత్రించి వేరే చోటికి తరలించి ప్రజలను వీధి కుక్కల బారినుంచి రక్షించాలి.

**మా బాబు కుక్కకాటుకు గురి అయ్యాడు**

**మాజీ ఉప సర్పంచు సురేష్, మోత్కుపల్లి,**



మా గ్రామంలో వీధి కుక్కలు దాదాపు 300పైగా ఉన్నాయి. ఏ వీధిలోనైనా కుక్కల బెడద విఫరీతంగా ఉంది కుక్కలను బెదిరిస్తే చాలు కుక్కలు మనుషులపై పడి దాడిచేస్తున్నాయి. అధికారులు వెంటనే వీధి కుక్కలకు షెల్టరు ఏర్పాటు చేసి వీధి కుక్కలను తరలిస్తే మంచిది,

# లక్ష్మాపూర్ చెరువుకు మత్తడికి అడ్డుకట్ట

**స్పందించిన ఇరిగేషన్ అధికారులు**

**భారీ వర్షాలతో లక్ష్మాపూర్ చెరువు మత్తడికి బుంగ పడటంతో మరమ్మతు పనులు**





బుంగకు ఇరిగేషన్ అధికారులు స్పందించి మరమ్మతు పనులు చేపట్టిన దృశ్యం

**శామీర్‌పేట, నవంబరు 2, ప్రభాతవార్త :** కురుస్తున్న భారీ వర్షాలతో లక్ష్మాపూర్ చెరువు మత్తడికి బుంగ పడటంతో నీరు వృధాగ వెళుతున్నట్లు స్థానికుల సమాచారంతో వెంటనే ఇరిగేషన్ అధికారులు స్పందించి మరమ్మతు పనులు చేపట్టి నీరు బయటకు వెళ్లకుండ చేశారు. ఆదివారం ఉదయం మూడుచింతలపల్లి మండలంలోని లక్ష్మాపూర్ గ్రామ చెరువు మత్తడికి బుంగ పడి నీరు వృధాగ వెళుతున్నట్లు గ్రామ నాయకులు క్యాతం మధుకృష్ణ, పలువురు రైతులు ఇరిగేషన్ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే దీనికి స్పందించి వర్క్‌ఇన్స్‌పెక్టర్ వాసు చెరువు మత్తడిని సందర్శించి మరమ్మతు పనులు కూలీల సహాయంతో చేయించారు.ఇటీవల తరుచూ వర్షాలు భారీగ, అతిభారీగ వర్షాలు కురిసి చెరువు మత్తడికి బుంగ పడటంతో నీరు వృధాగ వెళుతుండటంతో స్థానికుల సమాచారంతో వెంటనే ఇరిగేషన్ అధికారులు స్పందించి సందర్శించి పరిశీలించి మర మ్మతు పనులు చేసి నీరు వృధాగ బయటకు వెళ్లకుండ చేశారు. సిమెంట్ బస్తాలతో మత్తడి వద్ద పడిన బుంగకు మరమ్మతు పనులు చేశారు.ఎట్టకేలకు మత్తడి బుంగను పూడ్చటంతో నీరు వృధాగ వెళ్లకుండ స్పందించి తగు చర్యలు తీసుకున్నందుకు ఇరిగేషన్ అధికారులకు, వర్క్ ఇన్స్‌పెక్టర్ వాసుకు నాయకులు, రైతులు దన్య వాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ వర్క్ ఇన్స్‌పెక్టర్ వాసు, శానిటేషన్ సూపర్‌వైజర్ తోట ప్రవీణ్, కారోబార్ మంగ, నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

## తాచెడ్డ కోతి .. ఊరూరా అల్లరి

### (మొదటి పేజీ తరువాయి)

ఉండవలసి వస్తుందని, పొలాల వద్ద లేకపోతే ఈ సమయం అన్న వచ్చి పంటల ు నాశనం చేస్తున్నాయని చెప్తున్నారు. ఒకవైపు వర్షాలు కురిసి నష్టపోయామంటే మరోవైపు ఏమో మో కోతుల బెడద ఎక్కువై పంటలు నాశనం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.సమస్య ు పరిష్కరించడానికి సోలార్ ఫెన్సింగ్, మెష్ (జాలీ) కవర్లు, కట్టిన ప్రయోజనం లేదన్నారు. ప్రభుత్వం కోతుల ు పట్టించి దట్టమైన అడవిలో వదిలేలా చర్యలు చేపట్టి.. రైతుల ు, ప్రజల ు ఆదుకోవాలని కోరుతున్నారు.

**-కోతుల బెడద నుంచి కాపాడండి : డాకమొల్ల వెంకటయ్య గౌడ్**

నాగారం రైతు ఉదయం లేచినప్పటి నుంచి సాయంత్రం వరకు పొలం వద్దనే ఉంటున్న, ఏ క్షణంలో అయినా వందల సంఖ్యలో కోతులు వచ్చి పొలం నాశనం చేస్తున్నాయి. నాలుగు ఎకరాల వరిని సాగు చేశా ు. అధిక వర్షాలు కురవడంతో వరి నేల పాలు కావడంతోపాటు, కోతుల నాశనం చేశాయి.

## విజిలెన్స్ సైలెన్స్

### (మొదటి పేజీ తరువాయి)

జరుపుతున్నారు. వాటిని కూడా నిలిపివేయాలని ఆదేశించారు. ఉన్నతాధికారులు ఆఫీసులోనే ఉంటూ పర్యవేక్షించేలా రవాణా లారీలకు, యంత్రాలకు ఆధునిక సాంకేతికత అమర్చుకోవాలని స్పష్టం చేశారు. వీటిలో ఏ ఒక్కటీ లేకున్నా కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. కానీ ఎక్కడా